ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగష్టు 09, 2015

అందం.. అభినయం..

అణు తంత్రం

స్వాతంత్ర్య పోరాట 'దృశ్యం'

దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రతి అంకం జాతికి అమూల్యమైనదే. కాలం, తరం, ప్రాంతం, అంశం, పోరాట తీరు, ప్రయత్నం ఏదైనా కానీ అవి తలుచుకున్నపుడల్లా ప్రతి భారతీయుని గుండె దేశభక్తితో ఉప్పొంగుతుంది. ఆ కథలు, గాథల్ని కళ్లకు కట్టిన ఎన్నో చిత్రాల్ని భారత చలన చిత్ర పరిశ్రమ అందించింది. వాటిలో ప్రధాన చిత్ర సీమల నుంచి కొన్ని గొప్ప పోరాట చిత్రాల వివరాలు.

'ఎగారో, ది ఇమ్మోర్టల్ ఎలెవన్' పేరిట 2011లో విడుదలైన ఈ బెంగాలీ చిత్రం 1911 నాటి మోహన్ బగాన్ ఫుట్‌బాల్ జట్టు వీరోచిత పోరాట ఘట్టాన్ని దృశ్యీకరించింది. బ్రిటిషర్ల ఈస్ట్ యార్క్‌షైర్ రెజిమెంట్ జట్టుపై గెలిచిన తీరు స్వాతంత్ర్య సమరానికి బెంగాల్‌లో స్ఫూర్తినింపింది.

అస్సామీ చిత్రం 'అజెయో' సాహిత్య అకాడమీ అవార్డు గెలిచిన అస్సామీ నవల ఆశీర్బదోర్ రాంగ్ ఆధారంగా తీసింది. స్వాతంత్ర్య పోరాట సమయంలో అస్సాంలో సామాజిక దురాగతాలపై గజేన్ కొయిట్ చేసిన పోరాటమే ఈ సినిమా కథ. 2014 విడుదలైన ఈ చిత్రం నేషనల్ ఫిల్మ్, ప్రాగ్ బెస్ట్ సినీ అవార్డును గెలుచుకుంది.

ఈస్ట్ ఇండియా కంపెనీపై 1824 సైనిక పోరాటం చేసిన కన్నడ వీర నారి రాణి కిట్టూర్ చెన్నమ్మ యదార్థ జీవిత గాథ ఆధారంగా కన్నడ సినిమా తీశారు. 'కిట్టూర్ చెన్నమ్మ' పేరిట 1961లో విడుదలైంది ఈ చిత్రం.

ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు వీరపాండ్య కట్టబొమ్మన్ జీవితం ఆధారంగా 1959లోనే తమిళ చిత్రం తీశారు. అదే పేరిట విడుదలైన ఈ చిత్రం దేశభక్తిని నరనరాన ఎక్కిస్తుంది.

ప్రతి తెలుగు వాడి గుండెల్లో నిలిచిపోయే 'అల్లూరి సీతారామరాజు' చిత్రం 1974లో విడుదలైంది. ఆదివాసీలపక్షాన బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడిన రామరాజు గాథను ఆధారంగా తీసిన ఈ చిత్రమిది.

మళయాలీ చిత్రం 'కాలాపానీ' చిత్రం1996లో మిగతా భాషల్లోను విడుదలైంది. పోర్ట్‌బ్లెయిర్‌లోని పాషాణకారాగారం కాలాపానీలో ఆనాటి స్వాతంత్ర్య యోధుల కన్నీటి కథల్ని కళ్లకు కట్టింది.

భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు త్యాగాల ప్రస్తావన లేకుండా జాతి స్వాతంత్ర్య పోరాటం గాథకు విలువలేదు. క్రాంతివీరుడిగా దేశభక్తుల జేజేలు అందుకున్న శ్రీరాం హరి రాజ్‌గురు జీవితం ఆధారంగా తీసిన 'క్రాంతివీర్ రాజుగురు' అనే మరాఠీ చిత్రం 2014లో విడుదలైంది.

షహీద్, భగత్ సింగ్, లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్, రంగ్ దే బసంతి పేర్లతో హిందీలో భగత్ సింగ్ త్యాగాలపై చిత్రాలు వచ్చాయి. 2002లో వచ్చిన లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్ నేషనల్ ఫిల్మ్ అవార్డును గెలుచుకుంది. ఈ చిత్రంలో కోర్టు సీను భగత్ ఆశయాల్ని, వ్యక్తిత్వాన్ని కళ్లకు కడుతుంది.

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

దోమ మంచిదే!

సరకు అమ్ముకోడానికి వ్యాపారస్తులు ఎన్ని మాటలైనా చెప్తారు. ఎన్ని మాయలైనా చేస్తారు. ఎన్ని మర్మాలకైనా పాల్పడతారు. 'మరక మంచిదే' అన్న మాట అలా పుట్టించినదే. మామూలుగా మరక పడితే చాలు! తెగ బాధ పడిపోతాం. దిగులు చెందుతాం. స్కూళ్లకు, ఇంటర్వ్యూలకు, కోర్టులకు వెళ్లే వారైతే మరీను. స్కూల్లో టీచర్‌కి, ఇంటర్వ్యూలో అధికారికి, కోర్టులో న్యాయమూర్తికి ఏ మొహంతో ఎదురుపడాలో అర్థం కాక తల పట్టుకొంటాం. కానీ ప్రకటనకర్తలు మాత్రం మరక మంచిదని ప్రచారం చేసుకుంటారు. తమ సబ్బులు, సర్ఫులు, వాషింగ్ మెషీన్లు వున్నంత కాలం మరక మంచిదేనని చెప్తూనే వుంటారు.

ఆ మాటకొస్తే ఇకమీదట 'దోమ మంచిదే' అని కూడా చెప్పకోవచ్చేమో! మరి మరకతో పోలిస్తే దోమలు మాత్రం తక్కువా? ఇవి సర్వాంతర్యాములు. పల్లెలు, పట్టణాలు, నగరాలు, గ్రామాలు అన్న భేదాలేం లేవు. ఎక్కడ అపరిశుభ్రత వుంటే దోమల మకాం అక్కడే. పిల్లా జెల్లతో సకుటుంబ సపరివార సమేతంగా మురుగులో మజా చేస్తూ ... ఎన్నేసి రకాల రోగాలు, జబ్బులను వ్యాపింపచేస్తాయో తెల్సిందే! వీటి వల్ల ఎన్ని ఆస్పత్రులు కళకళలాడుతుంటాయో! ఎంత మంది వైద్యులు, వైద్య సిబ్బంది, సాంకేతిక నిపుణులు తీరికలేని పనులతో సతమతమౌతుంటారో!

వీటికి ఎవ్వరినీ విడిచిపెట్టే అలవాటే లేదు. స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సైతం పనులు పెట్టేస్తాయి. దోమలు వ్యాపించకుండా కాలువల్లో మందులు చల్లించడం నుంచి ఫాగ్ కొట్టించడం వరకు కోట్ల రూపాయలు ఖర్చు చేయించనిదే నిద్రే రాదు వాటికి.

వానాకాలం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుంటాయా జీవులు. సీజనల్ వ్యాధులను వ్యాపింపచేయడానికి అనువైన, సుఖువైన కాలమది. మరి అప్పడే కదా... రోగాలతో తండాలు మొదలుకొని పట్టణాలు వరకు అల్లాడిపోయేది. పత్రికలు, న్యూస్ చానళ్ల వారికి మాంచి గ్రాసాన్ని అందించే కాలం కూడా అదే. దోమల మీద, దోమకాటు మీద, అవి వ్యాపింపచేసే రోగాల మీద, ప్రభుత్వ ఆస్పత్రుల అస్తవ్యస్త నడక మీద, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ మీద సీరియల్ కథనాలు రాయడానికి అత్యంత అనువైన కాలమది.



◆ మనలో మాట

ఇక దోమల మీద కోట్ల రూపాయలు ఆర్జించే వ్యాపారస్తులను విస్మరిస్తే ఎలా? వాణిజ్య ప్రకటనల మీద ఎంతమందికి బతుకు తెరువు కల్పిస్తుంటాయో. దోమలు కుట్టకుండా తీసుకొనే ముందు జాగ్రత్తల్లో భాగంగా మార్కెట్లో లభించే వస్తువుల సంగతి మరుస్తామా? దోమతెరలు, లిక్విడ్ రీఫిళ్లు, మస్కిటో కాయిళ్లు, టార్టాయిస్‌లు, లేప్యాలు...వంటివి ఎన్నో. ఏది కొంటే మంచిదో? ఏది తక్కువ ధరకు వస్తుందో? తెలీక వినియోగదారులు అయోమయానికి 'గురి కాకుండా' టీవీల్లో, పత్రికల్లో ఎన్నెన్ని ప్రకటనలో! కానీ ఈ ప్రకటనల్లో దేన్ని నమ్మాలి? దేన్ని నమ్మకూడదో ఆ దోమలకే తెలియాలి!

ఇక ... జ్వరాల సీజన్లలో స్థానిక సభలు, అసెంబ్లీలు, పార్లమెంట్లను సైతం వేడి వేడి చర్చలతో ఊపేస్తాయి. అధికార పక్ష, ప్రతిపక్ష నేతలిద్దరూ కలిసి దోమల నివారణ మార్గాలపై కుస్తీలు పడుతుంటే ...'దోమ మంచిదే' అంటూ వ్యాపారవేత్తలు సొమ్ము చేసుకుంటూ వుంటారు. కాకపోతే తంటా అల్లా సామాన్యులకే! డబ్బున్నోళ్లు దోమలు దూర వీలులేని పరిశుభ్రమైన ఇళ్లల్లో హాయిగా వుంటారుగా!! ■



టపా

అద్భుత కళ్యాణం

పెళ్లి అనగానే మొదటగా చూసేది రూపం. అంగవైకల్యం ఉన్న వారికి పెళ్లి కుదర్చడం కష్టంగా భావిస్తారు అంతా. అలాంటిది కళ్యాణి కోహనా ఎంతో మంది వికలాంగులకు వివాహం చేయడం అభినందించదగ్గ విషయం. జార్జ్ ఆర్చిబాల్డ్ ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న పక్షులను కాపాడుతూ గొప్ప సేవ చేస్తున్నారు. పక్షులను ప్రేమించడం అనేది ఇతనిని చూసి నేర్చుకోవాలి.

లక్ష్మి, తూ.గో.జిల్లా

ప్రేమానుబంధం

ప్రేమ పొత్తిళ్లలోకి అనే కథ చాలా బాగుంది. నేటి ఆధునిక యుగంలో మనిషి విలువలు ఎంతలా దిగజారిపోయాయో ఈ వ్యాసం ద్వారా చక్కగా వివరించారు. మనిషి యాంత్రిక జీవితంలో తనకు ఉండే విలువలను నాశనం చేసుకుంటున్నాడు. చక్కని కథను అందించినందుకు ధన్యవాదాలు.

సోము, కమలాపురం

స్వరాభివందనం

సంగీతానికి రాయి సైతం కరిగిపోతుందంటారు. మన సంగీతమూర్తులు ఎంతో మందిని చలింపచేశారు. ఘంటసాల, ఇళయరాజా, బేగం అక్తర్ వంటి సంగీత ప్రముఖులు ఎందరో. వారందరికీ మా పాదాభివందనాలు. అలనాటి స్మృతులను గుర్తుకు తెచ్చినందుకు సంతోషం..

రమేష్, చెన్నూరు

సౌర రథాలు

మనిషి ఆలోచనకు, విజ్ఞానానికి అద్దం పడుతుందీ వ్యాసం. సౌర శక్తితో నేడు ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నాము. కార్లు, విమానాలు సైతం నేడు సౌర శక్తితో నడుస్తున్నాయి అంటే మనిషి ఎంత అభివృద్ధి సాధించాడో అర్థం అవుతుంది. ఈవారం రుచి ఎంతో బాగుంది. ముఖ్యంగా పొటాటో సగ్గుబియ్యం చాలా బాగుంది. ఇలాంటి వంటకాలు మరెన్నో అందించాలని కోరుకుంటున్నాము.

మల్లికార్జున రెడ్డి, యర్రగుంట్ల

ఆనంద లోకం

స్పెయిన్ అంటేనే గుర్తుకు వచ్చేది సంబరాల నగరమని. వారి సంస్కృతి, సంప్రదాయాలు జీవితాంతం నిలిచిపోయేలా చేస్తాయి. ఈ వారం వింత లోకం చాలా బాగుంది. అల్పాకా సాక్షిగా పెళ్లి చేసుకోవడం చాలా బాగుంది. సూపర్ కారు అద్భుతం. 21 ఏళ్ల కుర్రాడు సొంతంగా కారును డిజైన్ చేయడం అభినందించదగ్గ విషయం. మనిషి తలుచుకుంటే సాధించలేనిది ఏమి లేదని చెప్పడానికి ఇతడిని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

అమల, విజయవాడ

కలర్ అదుర్స్

బార్బీ బొమ్మ గురించి తెలియని వారు ఎవరూ ఉండరు. బార్బీ బొమ్మలాగా ఉండేందుకు చాలా మంది చాలా ప్రయత్నాలు చేసి వారి ప్రాణాల మీదికి తెచ్చుకున్నవారున్నారు. టాటియానా టుజోవా వంటి వారు అచ్చం బార్బీ బొమ్మలాగే ఉండి తన అందంతో ఎందరి గుండెలకు గాయం చేసిందో. అక్షయ్ కుమార్ జీవిత విషయాలు చాలా బాగా వివరించారు. ప్రేమ పొత్తిళ్లలోకి కథ చాలా బాగుంది.

శ్రీనాథ్, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

అణు తంత్రం

కవర్ స్టోరీ ———— 14

అణు శక్తి... ఈ పేరు వినగానే కొందరికి అణు బాంబులు గుర్తుకొస్తాయి. మరి కొందరికి అణు విద్యుత్ మదిలో మెదులుతుంది. ఇంకొందరికి మానవాళికి ముందున్న అణు విపత్తులు గుర్తుకొస్తాయి. నిజానికి ఈ మూడూ కలిస్తే అణు శక్తి.



స్ఫూర్తి 3
కేరళ కంటి రెప్ప

నవ్వుల్ పువ్వుల్ 4

స్మరణ 5
ప్రజాపక్ష పాత్రికేయుడు

సినిమా కబుర్లు 6
అందం.. అభినయం..

వింత లోకం 8
ఇదేం సినిమా

యువ 9
సర్వ స్నేహి

ఆదర్శం 10
మెడిసిన్ బాబా

ప్రత్యేకం 11
ఓ కప్పు కాఫీ

కథ 18
నేరం ఎవరిది ?

రుచి 21
పైనాపిల్ పచ్చడి

బాలనేస్తాలు 22
బొమ్మల పిచ్చి

విజేత 24
సామాన్యుని గెలుపు

జీవితం
అక్కడే ఆగండి -12

స్ఫూర్తి

కేరళ కంటి రెప్ప

నేత్రదాన ఉద్యమం చేపట్టి కేరళ చూపు బాగు చేశాడు. అంతర్జాతీయ వైద్యాన్ని సామాన్యునికి చేర్చి ప్రజల చూపుగా మారాడు. పేదవాడి కంటి బాధను నయం చేస్తోన్న టోనీ ఫెర్నాండెజ్ కేరళ కంటి రెప్ప. అంగామాలి అనే ఓ కుగ్రామాన్ని ప్రపంచ నేత్ర చికిత్సా కేంద్రంగా మార్చేసి ఆ గ్రామాన్ని కేరళ కంటిని చేశాడు. ఐదు దశాబ్దాలుగా సేవల్ని అందిస్తున్నా టోనీకి వయసు మళ్లడంలేదు. కొత్త లక్ష్యాలకు తన పనిని మళ్లించుకుంటున్నాడు.

సుమారు పది లక్షల మంది రోగులకు చికిత్స చేసి లక్షమందికి తన కార్యక్రమాల ద్వారా కంటి శస్త్రచికిత్సలు చేసిన టోనీ ఫెర్నాండెజ్ అధ్యాయం బిందువులానే మొదలై ఓ సంద్రంలా మారింది. ఇప్పుడు కేరళలో 175 ఫోరమ్‌లు ఆయన నేతృత్వంలో విస్తృతంగా పనిచేస్తున్నాయి. 4000 నేత్రదానాలు సాధ్యమయ్యాయి. 2800 మందికి కంటి మార్పిళ్లు జరిగాయి. యాభై ఏళ్ల క్రితం కేరళ గ్రామాల్లో కంటి చికిత్స అంటే అదో పెద్ద వైద్యం. పేదవాడి కలలో కూడా అసాధ్యం. కంటి సమస్యలకు ఎక్కడో ఉన్న అహ్మదాబాద్ ఆస్పత్రులకు చీటీలు రాసే స్థాయిలో వైద్యం ఉండేది. అంతదూరం వెళ్లలేక అంధులైపోయే పేదలు కొందరైతే, సూదంటి జబ్బును దూలమంత చేసుకునే సామాన్యులు కొందరు. కార్నియా మార్పిడి, నేత్రదానం, నేత్ర నిధి అనేవి భారీ శస్త్రచికిత్సలతో సమానం. సరిగ్గా అప్పుడే 1965 నాటికి ఇంగ్లండ్‌లో కార్నియల్ ట్రాన్స్‌ప్లాంట్‌లో శిక్షణ పూర్తిచేసుకున్నాడు డాక్టర్ టోనీ ఫెర్నాండెజ్.

భారత్ తిరిగి వచ్చాక మధురై వైద్యకళాశాలలో ప్రాక్టీస్ చేశాడు. పెద్ద నగరాల్లో మంచి సంపాదనతో పనిచేసే అవకాశమున్నా గ్రామాల వైద్య పరిస్థితులపైనే అధ్యయనం చేశాడు. అక్కడ ఆయన గమనించిన విషయం కార్నియా మార్పిళ్లు చేయగలిగితే చాలా మంది చూపు దక్కించుకోగలరని. వెంటనే కోచికి 40 కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతం, సౌకర్యాలు లేని అంగామాలికి తన పనిని మార్చాడు. స్థానిక లిటిల్ ఫ్లవర్ ఆస్పత్రిలో 1970లో ఫెసిలిటీని ప్రారంభించాడు. కానీ ఎదురైన సమస్య నేత్రదానంపై ప్రజల్లో ఉన్న భయాలు, అపోహలు, అవగాహనలేమి. వీటిని దూరం చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాడు. నేత్ర నిధిని స్థాపించి నేత్ర దానంపై ప్రచారం విస్తృతం చేశాడు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ వంటి సంస్థలను కూడదీసుకుని అవగాహన తరగతుల్ని ఏర్పాటు చేశాడు. ఆయన

ప్రయత్నాలు చెదిరిపోకుండా విశేష స్పందన వచ్చింది. విదేశాల నుంచి అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకుని కంటి ట్రాన్స్‌ప్లాంట్‌లు గ్రామజీవులకు, పేదవారికి పరిచయం చేశాడు. 1976 నుంచే పాఠశాలల్లో నేత్ర అవగాహన విప్లవానికి నాంది పలికాడు. వందలాది మంది టీచర్లకు కంటి స్క్రీనింగ్ టెస్టుల్లో శిక్షణనిచ్చి ప్రారంభంలోనే విద్యార్థుల సమస్యలు గుర్తించి వైద్యం అందేలా చేశాడు. ఇలా వేలాది మంది పిల్లలకు కంటి సమస్యలను దూరం చేశాడు. నేత్రనిధి ఉన్నా నేత్రాలను నిల్వ చేసేందుకు సరైన సదుపాయాలు లేక తొలుత శ్రీలంక నుంచి వాటిని సేకరించేవారు. బౌద్ధం విస్తారంగా ఉన్న శ్రీలంక నేత్రదానాల్లో ముందుండేది. ప్రపంచానికి ముఖ్యంగా భారత్‌కు శ్రీలంక ప్రజలు దానం చేసిన నేత్రాలు ఎక్కువగా అందుతుండేవి. అయితే వీటిని తెచ్చుకోవడానికి కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సిరావడంతో పేదలకు భారమయ్యేది. అంగామాలి లాంటి మారుమూల ప్రాంతంలో నేత్రనిధి ఏర్పాట్లకు ఇదే ఆటంకం కలిగించింది. తిరువనంతపురం, కాలికట్ వైద్య కళాశాలల్లో నేత్ర నిధుల ఏర్పాటుకు మొగ్గుతూ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అప్పటి కంటి మార్పిళ్లలో మొత్తం కన్ను తొలగించి చేసేవారు. తర్వాత కేవలం కార్నియా వరకు తీసి మాత్రమే మార్పిడి చేసే వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి అధునాతన కంటి వైద్యాన్ని టోనీ కేరళ గ్రామాలకు పరిచయం చేశాడు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స చేసేవాడు. మొదట్లో శిబిరాల్లోనే కంటి సమస్యను గుర్తించి అక్కడే శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చేది. ఆ తర్వాత స్థానిక ఆస్పత్రుల్లో నిర్వహించి మెరుగైన సదుపాయాల్ని కల్పించారు. నాలుగున్నర దశాబ్దాలుగా అలుపెరగకుండా చేస్తున్న ఆయన

సేవలతో కొన్ని వేల మంది నేత్ర మార్పిళ్లతో చూపు నిలబెట్టుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2008లో పద్మశ్రీతో గౌరవించింది భారత ప్రభుత్వం. రిటైర్‌మెంట్ వయసు వచ్చినా వెనక్కుతగ్గకుండా గతేడాది నుంచే కాచ్చా 2020 అనే మరో భారీ ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడు. 2020 నాటికి కేరళలో క్యాటరాక్ట్‌ను పూర్తిగా తొలగించాలని కంకణం కట్టుకున్నాడు. శాటిలైట్ కేంద్రాలను స్థాపించి ఉచితంగా క్యాటరాక్ట్ చికిత్సను అందిస్తున్నాడు. దీనికి మరింత ప్రచారం తెచ్చేందుకు కేరళ సూపర్‌స్టార్ మమ్ముట్టితో కలిసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నాడు. అరేబియా దేశాల నుంచి అంగామాలికి చికిత్స కోసం వస్తారు. కేరళ ప్రజలకు టోనీ ఫెర్నాండెజ్ అంటే కంటికి పర్యాయపదం.

✦

నవ్వుల్ – పువ్వుల్

వంశ పారంపర్యం

వెంకయ్య గారూ ఈ జబ్బు మీతో రాలేదు. వంశపారంపర్యంగా వచ్చింది. ఆపరేషన్ చేస్తే పోతుంది. చెప్పాడు డాక్టర్.

"అమ్మయ్య...బతికించారు. అయితే ఆ ఆపరేషనేదో మా తాతయ్యకు చెయ్యండి" అన్నాడు వెంకయ్య.

నమ్మకం

డబ్బు కోసం బ్యాంకును దోచుకోవాలనుకున్నాడు హరి.

లోపలికి ప్రవేశించి లాకర్ దగ్గరికి వెళ్ళగానే "**ద**యచేసి పేల్చడమో, కోయడమో చెయ్యవద్దు. తలుపు తెరిచే ఉన్నది హ్యాండిల్ తిప్పండి చాలు" అని రాసుండటంతో ఆ పని చేశాడు.

వెంటనే ఒక ఇసుక బస్తా నెత్తి మీద పడింది. అలారం మోగింది. దాంతో పోలీసులకు దొరికిపోయాడు

వ్యాన్లో తీసుకెళ్తుంటే "హు ...ఏం మనుషులో ఏమో. ఈ రోజుల్లో నమ్మించి మోసం చేయడం మామూలైపోయింది" అన్నాడు విచారంగా.

చేతి రాత

రవి: మా స్కూల్‌లో ఎవరూ చేయలేని పని నేను చేయగలను నాన్నా. చివరకు మా టీచర్ కూడా చేయలేదు తెలుసా!

తండ్రి: ఆహా అలాగా? ఏంటో ఆ పని చెప్పు మరి.

రవి: నా చేతి రాతను చదవడం నాన్నా...



స్టెప్పు

క్లాసులో వార్షిక లెక్కల పరీక్ష జరుగుతోంది. రమేష్ మాటిమాటికీ కూర్చున్న చోటి నుంచి లేచి స్టెప్పు లేసి కూర్చోవడం, ఏదో రాసి మళ్ళీ స్టెప్పు వేయడం తిరిగి కూర్చుని రాయడం చేస్తున్నాడు.

ఇది గమనించిన లెక్కల మాష్టారు రమేష్‌ను లేపి ఎందుకు అలా గంతులేస్తున్నావు అని అడిగాడు.

స్టెప్పు స్టెప్పు కు మార్కులుంటాయని ప్రశ్నాపత్రంలో ఇచ్చారు కదా సార్ అని రొప్పుతూ చెప్పాడు రమేష్.

మాయం

రెండు గంటల నుంచి నీతో మాట్లాడుతుంటే అసలు కాలం తెలియడం లేదు. నా తలనొప్పంతా మాయమైపోయింది అన్నాడు ధర్మారావు.

ఓ ఇప్పుడర్థమైంది నా తలలోకి వచ్చిన నొప్పి మీదేనా? తల పట్టుకుని అన్నాడు జగదీష్.

జ్ఞాపకశక్తి

బాబూ జ్ఞాపకశక్తి వెయ్యి రెట్లు పెంచుకోవటం ఎలా? అనే పుస్తకం ఉందా అడిగాడు రామకృష్ణ పుస్తకాల షాపులో.

ఉంది సార్. నూట ఇరవై రూపాయలు అన్నాడు షాపతను.

డబ్బులిచ్చి పుస్తకం తీసుకుని వెళ్తున్న రామకృష్ణను "సార్ చదవనప్పుడు ఈ పుస్తకం మీకెందుకు?" అని అడిగాడు.

నేను చదవనా? ఎవరన్నారు? కోపంగా అడిగాడు రామకృష్ణ.

ఇదే పుస్తకం మీరు గతంలో నాలుగు సార్లు కొన్నారండి. అందుకే అలా అడిగాను.

బీ ప్రాక్టికల్

రాజు: నువ్వు ఇంతకుముందు ఎవరినైనా ప్రేమించావా?

రాణి: మా నాన్న పెద్ద బిజినెస్‌మాన్ అని తెలుసుగా.

రాజు: తెలుసు.

రాణి: ఆయనకు 1000 కోట్ల ఆస్తి ఉందని తెలుసుగా?

రాజు: తెలుసు.

రాణి: అందులో సగం నాది అని తెలుసుగా?

రాజు: తెలుసు.

రాణి: ఇప్పుడు చెప్పు. నేను ఇంతకుముందు వేరే ఎవర్నయినా ప్రేమించడం, ప్రేమించకపోవడం పెద్ద సమస్యా??

మేధావులను పాలకవర్గాలు రకరకాల ఆకర్షణల ద్వారా తమ దారికి తెచ్చుకుంటాయి. పదవులు, పురస్కారాలు, సొమ్ముల ఆశలు చూపిస్తాయి. చాలామంది వాటికి లొంగిపోతారు. ఇలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండేవారు అక్కడక్కడా కనిపిస్తుంటారు. ఇటీవల మరణించిన ప్రఫుల్ బిద్వాయ్ ఈ కోవకు చెందిన ప్రజాపక్ష పాత్రికేయుడు.

ప్రజాపక్ష పాత్రికేయుడు

ప్రఫుల్ బిద్వాయ్

జీవితాంతం మతతత్వం, అమెరికా సామ్రాజ్యవాదం, సామాన్య, పేద ప్రజానీకానికి గుదిబండగా మారిన నూతన ఆర్థిక విధానాల్ని ఆయన తన రచనల ద్వారా ఎండగట్టారు. కార్పొరేట్ శక్తులు, పాలకవర్గాల కుమ్మక్కును దునుమాడారు. తొలినుంచీ వామపక్ష భావాలకు కట్టుబడిన ప్రఫుల్ బిద్వాయ్ పేదలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, పీడిత వర్గాల పక్షాన నిలిచారు. భోపాల్ ఘోర పాపాలను బట్టబయలు చేశారు. అభివృద్ధి పేరిట ఆదివాసీలను నిర్వాసితులు చేసి పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్న సర్దార్ సరోవర్ ప్రాజెక్టు లోటుపాట్లను విశ్లేషించారు. నర్మదా బచావో ఆందోళనకు అండగా నిలిచారు. అన్యాయానికి, దోపిడీకి గురవుతున్న వర్గాలు ఏవైనా సరే, అవి పాలస్తీనీయులు కావచ్చు, భూ నిర్వాసితులు కావచ్చు, ప్రఫుల్ వారికి మిత్రుడయ్యారు. దళితులపై దుర్మార్గాలు, లింగవివక్ష... ఇలా అంశమేదైనా ఎల్లవేళలా పీడితుల పక్షాన నిలబడి వారి సమస్యల్ని తన రచనల ద్వారా ఎత్తి చూపారు. సమస్య మౌలిక కారణాలు, పాలకుల దుర్మార్గాల్ని వామపక్ష దృష్టి కోణంలోంచి అందరికీ అర్థమయ్యేలా విశ్లేషించటం ఆయన ప్రత్యేకత.

అణ్వాయుధ రహిత ప్రపంచ నిర్మాణం ప్రఫుల్ బిద్వాయ్ చిరకాల స్వప్నం. ఈ లక్ష్య సాధన కోసం ఆయన అంతర్జాతీయ సంస్థ 'కోయలేషన్ ఫర్ న్యూక్లియర్ డిసార్మమెంట్ అండ్ పీస్'ను స్థాపించారు. రిటైర్డ్ అడ్మిరల్ రాందాస్, ప్రముఖ జర్నలిస్టు ఎన్.రామ్, ప్రొఫెసర్ అచిన్ వనైక్, ప్రబీర్ పుర్కాయస్త తదితరులు ఈ ఉద్యమ కార్యాచరణలో ఆయన ముఖ్య సహచరులు.

ప్రఫుల్ బిద్వాయ్ మధ్యప్రదేశ్‌లో జన్మించారు. ఈయన తండ్రి నాగపూర్‌లో ప్రొఫెసర్‌గా పని చేసేవారు. ఐఐటి బొంబాయిలో చదివేటప్పుడు ప్రఫుల్ బిద్వాయ్ వామపక్ష భావాల పట్ల ఆకర్షితులయ్యారు. తన భావజాలానికి అనుగుణంగా కొందరు మిత్రబృందంతో ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. 1960 దశకంలో అమెరికా, ఐరోపా దేశాలలో నల్లజాతి వారి హక్కుల పోరాటం, విద్యారంగ సంస్కరణలు, వియత్నాం యుద్ధ వ్యతిరేక ఆందోళనలు, సమాజంలోని అసమానతలు, అన్ని రకాల దోపిడీలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలు ఈ బృంద సభ్యుల్ని ఉత్తేజపరిచాయి. తమ జీవిత లక్ష్యాల్ని నిర్దేశించుకొనేలా చేశాయి. ఐఐటి మూడో సంవత్సరంలో (ఐదేళ్ళ కోర్సు) ఉండగానే చదువుకు స్వస్తి చెప్పిన ప్రఫుల్ బిద్వాయ్ సామాజిక పాఠశాలలో అడుగుపెట్టారు. తొలుత మహారాష్ట్రలో ఆదివాసీలు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న 'సాహాదా' ఉద్యమంలో పని చేయసాగారు. అనారోగ్యం కారణంగా 1972లో ముంబాయికి తిరిగి వచ్చిన ప్రఫుల్ పలువురు వృత్తి నిపుణులతో కలిసి 'సర్చ్' పేరిట ప్రగతిశీల సంస్థను ఏర్పరచారు.

1978లో జర్నలిజంలో ప్రవేశించిన ప్రఫుల్ బిద్వాయ్ టైమ్స్ ఆఫ్ ఇండియాలో 1993 వరకు పనిచేశారు. అనంతరం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవితాంతం కొనసాగారు. ఫ్రంట్ లైన్, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలతో పాటు పలు దేశాలు, అంతర్జాతీయ పత్రికలకు కాలమిస్టుగా ఉన్నారు. ప్రతివారం 'కాలమ్' రాయటం జర్నలిస్టులకు కత్తిమీద సామే అవుతుంది. ప్రఫుల్ బిద్వాయ్ సమకాలీన అంశాలన్నింటిపైనా వామపక్ష కోణంలో విశ్లేషణ చేసేవారు. ప్రతి వ్యాసమూ ఆణిముత్యమే. పాఠకులు బాగుంది, చాలా బాగుంది, బ్రహ్మాండం అనాల్సిందే. ఇంతటి ప్రతిభ, పరిశోధన, విశ్లేషణా సామర్థ్యం చాలా అరుదుగానే మనకు కనిపిస్తుంది.

"ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటానికి నరేంద్రమోడీ అదానీ వంటి గ్రూపు వారందించిన ప్రైవేటు వాహనంలో ఢిల్లీకి చేరుకున్నారు. దేశ రాజధానికి అడుగిడగానే 'హరహర మోడీ' అంటూ నినదిస్తున్న కార్యకర్తల స్వాగతాన్ని స్వీకరించారు. ఈ విధంగా ఆదిలోనే బడా వ్యాపారులు – హిందూత్వ పట్ల తన నిబద్ధత – ప్రాధాన్యతను వెల్లడించుకున్నారు" అంటూ నరేంద్రమోడీ ఏడాది పాలనపై రాసిన విశ్లేషణాత్మక వ్యాసంలో ప్రఫుల్ బిద్వాయ్ వ్యాఖ్యానించారు. ఆయన నిశిత పరిశీలన, రచనా పటిమకు ఇదొక నిదర్శనం మాత్రమే. ప్రఫుల్ పలు పుస్తకాల్ని రచించారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంపై రాసిన ఆయన గ్రంథం త్వరలో ముద్రణకు రానుంది.

పెద్ద సంఖ్యలో మేధావులు, విద్యావేత్తలు, పాత్రికేయులు అధికార పదవులు, బిరుదులు, భౌతిక ప్రయోజనాల కోసం పాలకవర్గాలకు అమ్ముడుపోతున్న నేటి కాలంలో వీటన్నింటికీ దూరంగా సామాజిక నిబద్ధతతో తన బాధ్యతను నిర్వర్తించిన ప్రజాపక్ష పాత్రికేయులు ప్రఫుల్ బిద్వాయ్ మనందరికీ ఆదర్శపాత్రుడే.

- బి.భాస్కర్
9989692001



చక్కని చదువరి. అంతకంటే చక్కని రూపం. ఎంతటి క్లిష్ట సమస్యనైనా చిటికెలో పరిష్కరించగల సూక్ష్మ గ్రాహి. అన్నింటిని మించి క్రమశిక్షణ ...తనదైన జీవన సరళి. అన్ని కలగలిపితే... జయలలిత.

అందం ..అభినయం..

జయలలిత తల్లి సంధ్య కూడా కథానాయికే. ఆమెది చక్కని రూపం. చలన చిత్ర సీమలో అగ్రనటుల సరసన నటించిన చరిత్ర. హావభావ ప్రదర్శనలో సున్నితమైన అభినయాన్ని సొంతం చేసుకుంది. తన కూతురు జయలలితని "మనుషులు-మమతలు" చిత్రంలో అక్కినేని సరసన పరిచయం చేసింది. జయలలిత స్విమ్ సూట్‌లో పరిచయమై సిగ్గేస్తుందా....సిగ్గేస్తుందా మొగ్గలాంటి చిన్నది' పాటతో ఆనాటి యువకుల హృదయాల్ని కొల్లగొట్టింది. సావిత్రి, జగ్గయ్య లాంటి దిగ్గజాలు నటిస్తున్నా చెక్కు చెదరలేదు. మరో సినిమా 'వో కౌన్ థీ' హిందీ రీమేక్ 'ఆమె ఎవరు?' చిత్రంలో కథానాయికగా నటించి మంచి మార్కులే కొట్టేసింది. దెయ్యంలా ఆద్యంతమూ భయపెడుతుంది. 'ఓ నా రాజా.. రాజా.. చెలిమే మరచేవో' పాటలో జుత్తు విరబోసుకొని వినూత్నమైన నటన ప్రదర్శించింది. జయలలిత నటన పలువురిని ఆకర్షించింది.

ముద్దు ముద్దు మాటలు

'బ్రహ్మచారి' చిత్రంలో అక్కినేనిని టీజ్ చేసే హీరోయిన్‌గా ఆ రోజుల్లో సంచలనం సృష్టించింది. అక్కినేని జయలలిత సరసన నటించినపుడు సరికొత్త గెటప్‌లో కనిపించి మరింత చిన్న పిల్లాడిలా నటించడం విశేషం. 'అదృష్టవంతులు' చిత్రంలో 'అయ్యయ్యో బ్రహ్మయ్య అన్యాయం చేశావేమయ్యా...' అంటూ అక్కినేని పాడిన పాటలో బుల్లెమ్మ పాత్రలో కుర్రకారుని విపరీతంగా రెచ్చగొట్టింది. నటన విషయానికొస్తే జయలలితది ప్రత్యేకమైన బాణీ. ముద్దుముద్దు మాటలతో అలరించే శృంగార సన్నివేశాల్లో ఆ పాత్రలకి ప్రాణ ప్రతిష్ఠ చేస్తూ దూసుకుపోయింది.

జయలలితని యన్.టి.ఆర్ తన సినిమాల్లోకి ఆహ్వానించాడు. చిక్కడు-దొరకడు, కథానాయకుడు, గోపాలుడు భూపాలుడు, బాగ్దాద్ గజదొంగ, ఆలీబాబా నలభై మంది దొంగలు, నిలువు దోపిడి, తిక్క శంకరయ్య, శ్రీ కృష్ణ సత్య...లాంటి చిత్రాలు చేసింది. జయలలితని యన్.టి.ఆర్ చాలా గౌరవించేవాడు. తన కుటుంబ సభ్యురాలిగా చూసేవాడు. ఈ నేపథ్యంలో జయలలిత యన్.టి.ఆర్‌కి విలువైన వజ్రపు ఉంగరం కానుకగా ఇచ్చింది. ఇటువంటి మరో రెండు ఉంగరాలు యం.జి.ఆర్, శోభన్‌బాబు దగ్గర వున్నాయి. ఎన్టీఆర్ కూడా జయలలితని తన ఆడబిడ్డగా గౌరవించి విలువైన కానుకలు కలకాలం గుర్తుంచుకునే బహుమతులను అందించాడు. జయలలిత కూడ అంతే సమానమైన గౌరవం ఇచ్చేది. కథానాయకుడు చిత్రంలో నటిస్తున్నపుడు ఎన్టీఆర్‌కున్న ప్రజాదరణని చూసి ఎప్పటికైనా మీరు గొప్ప ప్రజాప్రతినిధి అవుతారన్న ఆశాభావం వ్యక్తం చేసింది. అదే నిజమైంది.

ప్రీతిపాత్రమైన కథానాయిక

తదుపరి 'సుఖదు:ఖాలు' చిత్రంలో రామకృష్ణ సరసన 'గూఢచారి 116' లో క్రిష్ణ సరసన, 'శ్రీరామకథ'లో హరనాథ్

శివాజీ గణేశన్‌తో...

అక్కినేనితో...

ఎన్టీఆర్‌తో...

సరసన నటించింది. ఈ చిత్రాలన్నీ ఒక ఎత్తయితే శోభన్‌బాబు సరసన నటించిన 'డాక్టర్ బాబు' చిత్రం మరో ఎత్తు. నిజానికి శోభన్ సరసన నటించిన హీరోయిన్‌లు అందరికంటే తనకు అత్యంత ప్రీతి పాత్రమైన హీరోయిన్ జయలతిత అని తెలిపాడు. 'నేను-నా కథానాయికలు' శీర్షికన 'స్క్రీన్‌ప్లే' మాసపత్రికలో శోభన్ స్వీయ రచనలో పేర్కొన్నాడు.

జయలలితకి తెలుగు సినీ పరిశ్రమలో ఎంత మంచి పేరుందో తమిళ సినీ రంగంలో కూడా అంతే పేరుంది. మొదట్లో శివాజీ గణేషన్, జయశంకర్‌ల సరసన నటించినా యం.జి.రామచంద్రన్‌తో నటించడం మొదలు పెట్టింది. యం.జి.ఆర్ సరసన అప్పట్లో సరోజా దేవి వరుస విజయాలు సాధించింది. వారిద్దరి మధ్య అపార్థాలు చోటు చేసుకున్నాయి. అదే సమయంలో జయలలిత యం.జి.ఆర్ నటించడం తమిళ ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చార్యాల్లో ముంచెత్తింది.

ఏకసంథాగ్రాహి

జయలలిత ఏకసంథాగ్రాహి. సెట్‌లో డైలాగు చెబుతున్నప్పుడు అది ఏ భాషయినా ఒకసారి పేపరు చూస్తే ఒక్క అక్షరం పొల్లు పోకుండా పాత్రని ఆకళింపు చేసుకుంటూ నటించి అందరినీ ఆశ్చర్యపరిచేది. తన సంభాషణలు మాత్రమే కాకుండా కాంబినేషనులో ఉన్న పాత్రల సంభాషణలన్నీ సెట్లో చెప్పి ఆశ్చర్యపరిచేది. ఎప్పుడూ ఇంగ్లీషు నవల చేతిలో పట్టుకొని తనేదో తన పనేదో తప్ప ఇతర విషయాల్లో జోక్యం చేసుకొనేది కాదు. ప్రొడక్షను వారిమీద వారు కల్పించే సదుపాయాల మీద ఆధారపడకుండా తన ఖర్చులు తన అసిస్టెంట్ల ఖర్చు తానే భరించేది. జయలలిత ఏం చేసినా ఆ రోజుల్లో విడ్డూరంగా చెప్పుకొనేవారు. చిత్రం ప్రారంభ సమయంలో ముగింపు సమయంలోనూ సాంకేతిక నిపుణులకు విలువైన కానుకలు ఇవ్వడం అలవాటు చేసుకుంది. మహానటి సావిత్రిని అమితంగా ప్రేమించే జయలలిత.... సావిత్రి అవసాన కాలంలో సహాయం చేయడానికి వచ్చినా సావిత్రి నిరాకరించింది.. ఈ బాధ జయలలితలో చాలా కాలం వుండేది.

చక్కటి ఇంగ్లీషు

జయలలిత వ్యక్తిగతంగా పాతతరం నటీమణుల్ని చాలా గౌరవించేది. యస్.వరలక్ష్మి, జి.వరలక్ష్మి, పద్మనాభం, బాల సరస్వతి వీరందర్ని ఏదో ఒక రూపంలో ఆదుకున్న సందర్భాలు వున్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషా చిత్రాల్లో నటించినా తన పాత్రకు తనే డబ్బింగ్ చెప్పుకొనేది. ఒక ఇంగ్లీషు చిత్రంలో నటించినప్పుడు జయలలిత ఇంగ్లీషు ఉచ్ఛారణ చూసి అందరూ ఆశ్చర్యపోయారు. తరువాత మరికొన్ని ఇంగ్లీషు చిత్రాల్లో నటించేందుకు అవకాశం వచ్చినా జయలలిత సున్నితంగా తిరస్కరించింది.

ఎంజీఆర్‌తో...

ఆట..పాట

జయలలితకి నృత్యం పట్ల అభినివేశం ఉంది. శైవా మాస్టారి దగ్గర భరత నాట్యం, ధర్వార్ కృష్ణ కుమార్ మాష్టారి దగ్గర కథాకళి నేర్చుకుంది. చిన్నప్పుడే ఫంక్షన్లలో నాట్య ప్రదర్శన ఇచ్చి పలువురిని మెప్పించిన జయలలిత నృత్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ చూపించేది. తెలుగు సినిమాల్లో పాటలు పాడే అవకాశం కుదరలేదు. తమిళ సినిమాల్లో చాలా పాటలు పాడింది. సంగీత సాహిత్య సన్నివేశాల్లో పరిపూర్ణత్వం సాధించేందుకు పట్టుదలతో కృషి చేసింది. చిన్నతనంలో తను చర్చ్ పార్క్ స్కూల్లో చదువుతున్నప్పటి నుంచి న్యాయవాది రామ్ జెత్మలానీ స్థాయికి చేరుకోవాలని కలలు కనేది. అయితే ఆమె జీవితంలో ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. యం.జి.ఆర్‌కి పంచ ప్రాణాలుగా ఉన్న జయలలితను తన పార్టీ ప్రచార కార్యదర్శి నుంచి అన్నాడియంకె పార్టీలో అతి కీలకమైన నాయకురాలిగా ఎదిగింది. జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా చెక్కుచెదరని జయలలిత ... చిన్నతనం నుంచి వైవిధ్యమైన జీవన సరళిని అలవరుచుకున్న జయలలిత... జీవితంలో స్వశక్తితో విజయ సోపానాలు నిర్మించుకుంది.

ఇమంది రామారావు
9010133844

ఫోలింగ్ ఆడి..

విదేశాల్లో బౌలింగ్‌కు క్రేజ్ ఎక్కువ. అలాగే ఫుట్‌బాల్‌కు కూడా. ఫుట్‌బాల్ అంటే సాకర్ కాదండి. అమెరికాలో పాపులరైన మరో యార్డ్ గేమ్. ఈ రెంటినీ మిక్స్ చేసి ఫోలింగ్ అనే ఆటను కనిపెట్టాడు క్రిస్ హట్ అనే కుర్రాడు. బౌలింగ్ పిన్నులను వరసగా పేర్చి ఫుట్‌బాల్‌తో వాటిని కొట్టడమే ఆట. మన గ్రామాల్లో ఏడు పెంకులు ఆట గుర్తొస్తోందా. అలాగే ఉంటుంది కానీ, భారీగా హంగామా చేసేసి, ట్రోఫీలు గట్రా పెట్టేసి, మాంచి లైవ్‌వైర్ మ్యూజిక్‌తో బార్ సర్దేసి ఆ ఆటను గొప్పది చేసి పడేశాడు. ఏకంగా 34 వేల చదరపు అడుగుల స్థలంలో ఫోలింగ్ వేర్‌హౌస్‌ను తయారుచేశాడు. 11 ఏళ్లుగా టోర్నమెంట్లు పెడుతూ ప్రచారం తెచ్చాడు. యువత బాగా ఇష్టపడుతున్న సూపర్‌ఫోల్ గేమ్ టోర్నీలో ఇప్పుడు చాలా జట్లే పోటీపడుతున్నాయి.

వింత లోకం



యాంజెలో వాల్కెన్‌బోర్గ్ అనే బెల్జియన్ వ్యక్తి భార్యను ఇంటిని వదిలేసి అడవులకు చేరాడు. అక్కడే తనకు నచ్చిన పద్ధతుల్లో బతికేస్తున్నాడు. సంసారం మీద విరక్తి చెంది కాదు అడవులపై ప్రేమ పుట్టి. 31 ఏళ్ల యాంజెలోకు సాహసయాత్రలంటే చాలా ఇష్టం. పెళ్లయినా కూడా వాటిపై మోజు తీరక భార్యను విడిచి వారాలకు వారాలు అడవుల్లో, కొండల్లో గడిపేవాడు. మొదట్లో భార్య సరిపెట్టుకున్నా తర్వాత ఆమెకు విసుగు పుట్టింది. ఉద్యోగం ఊడుతున్నా కూడా పట్టించుకోకుండా ఈ యాత్రలేంటని ప్రశ్నించేది. భార్య అంటే ఇష్టమున్నా అడవి జీవితం డామినేట్ చేసేసేది. మళ్లీ మామూలే. స్వీడన్‌కు మరో యాత్ర వేయడంతో ఆయన కథ అడ్డం తిరిగింది. భార్య విడాకులిచ్చేసింది. ఆమె అలా చేయడం సరైనదేనని అంగీకరించినా తీవ్ర డిప్రెషన్‌కు లోనయ్యాడు. ఉద్యోగాన్ని కోల్పోయాడు. ఒంటరిగా మిగిలిన యాంజెలోకి స్లొవేనియా అడవుల్లో తలదాచుకోవడం మొదలెట్టాడు. అక్కడే చిన్న గుడారం వేసుకుని, అంతకు ముందు నేర్చుకున్న అటవీ మనుగడ విధానాల సాయంతో హాయిగా బతికేస్తున్నాడు. వేటపై అక్కడ నిషేధం ఉండటంతో సమీప గ్రామానికి వెళ్లి వారానికి సరిపడా మాంసాన్ని తెచ్చుకుంటాడు.అలా తన శేష జీవితమంతా అడవిలోనే గడిపేయాలని డిసైడై పోయాడు.

అడవికి అంకితం

ఇదేం సినిమా

టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో అలామో డ్రాఫ్ట్‌హౌజ్ వారు 'జాస్ ఆన్ ది వాటర్' అనే సినిమా షో వేస్తుంటారు. ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు స్టీఫెన్ స్పీల్‌బర్గ్ హారర్ క్లాసిక్ అయిన 'జాస్' అనే షార్కుల సినిమాని ప్రత్యేకంగా తెరపై చూపిస్తారు. సముద్రంలో షార్కుల బీభత్సాన్ని ప్రత్యక్షంగా చూసిన భావన కలిగిస్తున్నారు వీక్షకులకు. టెక్సాస్‌లోని స్కీ రాంచ్ బీచ్‌లో లైఫ్‌బౌయ్‌లలో వీక్షకులను ఉంచి ఒడ్డునున్న తెరపై సినిమా ప్రదర్శిస్తారు. భయానక సన్నివేశాలు వచ్చినప్పుడల్లా వారు నిజంగానే షార్కులు తమ చుట్టూ తిరుగుతున్నాయన్న భ్రమలో కేకలు పెడుతున్నారట. 'వామ్మో ఇదేం సినిమారా' అంటూ భయపడిపోతున్నారట.

సర్ప స్నేహి

చమన్ సింగ్ పాముల్ని ఆడించే కుటుంబంలో పుట్టలేదు. కానీ, పాములంటే ఇష్టం. అపాయంలో పడిన పాముల్ని రక్షిస్తూ తన ఇష్టాన్ని వ్యక్తం చేస్తుంటాడు. అప్పుడప్పుడూ కాదు రోజూ ఇలా వాటిని కాపాడుతూ తన ప్రేమను చాటుతుంటాడు. పదేళ్లలో 20 వేల పాముల్ని కాపాడాడంటే ఎంతలా అంకితమయ్యాడో అర్థమవుతుంది.

ఉదయ్‌పూర్‌కు చెందిన చమన్ సింగ్ సాధారణ మధ్యతరగతి కుటుంబంలోనే పుట్టాడు. అందరి పిల్లల్లానే పెద్ద చదువులు చదవాలని తండ్రి కోరుకున్నాడు. అతని మాట ప్రకారమే 10 వరకు కానిచ్చినా అతని మనసు ఎపుడూ వన్యప్రాణులు చుట్టూనే తిరుగుతుండేది. వీధుల్లో స్నేహితులతో తిరుగుతున్నపుడు ఏ పిల్లో, కుక్కో, పక్షో అపాయంలో పడి కనిపించాయంటే వెంటనే వాటిని కాపాడేందుకు పరుగెత్తుకు వెళ్లిపోయేవాడు. ప్రథమ చికిత్స నుంచి అవి కోలుకునేంత వరకు కంటికి రెప్పలా చూసుకునేవాడు. వాటిని తన మిగతా స్నేహితుల్లాగే పరిగణించేవాడు. వాటి కళ్ల నుంచే వాటి భావాల్ని, అర్థాల్ని తెలుసుకునేవాడు. ఇలా పెద్దవాడౌతున్న తీరు తండ్రికి భయం కలిగించింది. వాటి నుంచి దూరంగా తెచ్చేందుకు ఫ్యాక్టరీలో పనిచూశాడు. చమన్‌కు అదీ సరిపడలేదు. చేసేది ఏం లేక తండ్రి కోసం రిక్షాను తొక్కాడు. అదీ నచ్చలేదు. మనసంతా మూగ ప్రాణుల మీదే ఉంది. ఇక ఏమీ ఆలోచించకుండా వాటి సంరక్షణకే అంకితమయ్యాడు.

ఉదయ్‌పూర్‌లో పాముల బెడద ఎక్కువ. ప్రమాదకరమైన నల్లతాచుల సంఖ్య ఎక్కువే. వర్షాకాలం వచ్చిందంటే జనానికి పాముల టెన్షన్ మొదలౌతుంది. ఏ రకం పాము కనిపించినా కొట్టి చంపేయడం మామూలే. అన్ని పాములు విషపూరితం కాదనే విషయం చమన్‌కు తెలుసు. హాని చేయని సర్పాలను చంపేయడం అతడికి బాధ కలిగించింది. నల్లతాచులు విషపూరితమే అయినా వాటికి ప్రమాదం కలగని పక్షంలో హాని తలపెట్టవని గమనించాడు. అనవసరంగా గాల్లో కలిసిపోతున్న ఈ సర్పాలను కాపాడాలని నిశ్చయించుకుని బరోడా వెళ్లి స్నేహల్ పటేల్ దగ్గర పాముల్ని పట్టుకోవడంలో తర్ఫీదు పొందాడు. ఈ శిక్షణతో పాటు తన ప్రేమను జోడించి పాముల్ని అలవోకగా పట్టుకుని సురక్షిత ప్రాంతాల్లో విడిచిపెట్టడం ప్రారంభించాడు. సున్నితంగా వాటిని పట్టుకునే మెళుకువ తెలిస్తే అవి ఏ హానీ చేయవని చమన్ అంటాడు. ఆయన మాట నిజమన్నట్టు ఇప్పటి వరకు ఒక్క పాము కూడా అతణ్ని కాటేయలేదు. పదేళ్లుగా ఈ పనిచేస్తున్నా సుమారు 20 వేల పాముల్ని పట్టుకున్నా ఏ రోజు వాటితో ఇబ్బంది పడలేదు. పాముల్ని పట్టుకునేందుకు 100 అడుగుల బావిలోకి వెళ్లాడు. ప్రమాదకరంగా ఉన్న ఎత్తులకు వెళ్లాడు. అటవీ శాఖ, జంతు సంరక్షణ సంస్థలతో కలిసి పనిచేసే చమన్ మామూలు రోజుల్లో రోజుకు నాలుగు పాముల్ని రక్షిస్తుంటాడు. అదే వర్షాకాలం వచ్చిందంటే 20 కేసుల్ని చూస్తాడు. రాత్రిళ్లు కూడా సేవలు అందిస్తాడు. ఈ పాముల్ని కేవలం పట్టుకుని విడవడంతోనే సరిపెట్టడం లేదు. తాను పట్టుకున్న పాముల వివరాలతో రికార్డును నిర్వహిస్తున్నాడు. పదే పదే గ్రామాల్లోకి చొరబడే పాముల్ని పసిగట్టి వాటిని సుదూర ప్రాంతానికి తరలిస్తాడు. ఇతడి జాబితా వల్ల ఏ రకం పాములు ఆ ప్రాంతంలో మనుగడ సాగిస్తున్నాయో, ఎటువంటి యాంటీ వెనమ్‌కు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలో వంటి విషయాలు ప్రభుత్వాధికారులకు తేలికయ్యాయి. పాములు మిగతా సరీసృపాలపై అపోహలు తొలగించేందుకు స్థానికులను అవగాహన కలిగిస్తున్నాడు. అక్కడ బలంగా నాటుకుపోయిన ఓ మూఢనమ్మకం ఉంది. అదే ఉడుము విషపూరితమైందని, అది ఉన్న చోట పిడుగులు పడతాయని. ఇలాంటి విషయాలు అవాస్తవాలంటూ జంతు సంరక్షణ సంస్థలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించాడు. తాను కొన్నింటినే రక్షించగలుగుతున్నాడని ఇంట్లో వారికి పాముల్ని పట్టడంలో శిక్షణనిచ్చాడు. ఉత్సాహవంతులకు నేర్పిస్తున్నాడు. జంతువుల సంరక్షణ ఆస్పత్రిని ప్రారంభించాలనేది చమన్ కల. దుర్ఘటనలలో గాయాలపాలైన జీవులకు సరైన చికిత్స అందక ప్రాణాలు విడుస్తున్నా ఏమి చేయలేకపోవడం బాధాకరమని అంటాడు.



జెఎస్పీ

మందులు కొంటాం గానీ పూర్తిగా వాడకుండానే పడేస్తాం. అవే మిగిలిపోయిన మందులు పేదవారికి అందితే వాళ్లకు గొప్ప సాయమే అవుతుంది. రోగం కన్నా మందుల భారం ఎక్కువయ్యే పేదవారికి ఈ సాయమే చేస్తున్నాడు న్యూఢిల్లీకి చెందిన ఓంకార్‌నాథ్ అనే పెద్దాయన. ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన మందుల్ని సేకరించి పేద రోగులకు పంచుతున్నాడీ మెడిసిన్ బాబా.

మెడిసిన్ బాబా

ఓంకార్ నాథ్ న్యూఢిల్లీలో ఓ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్‌గా పనిచేసి రిటైరయ్యారు. వైద్య సేవ అందించిన ఆయన ఊరికే కూర్చోలేక ఏదో ఒక రకంగా రోగులకు సేవ చేయాలని అనుకున్నారు. డెబ్భై ఏళ్ల నిండాక కూడా ఎందుకా శ్రమ అని ఇంటివారు వారించినా వినలేదు. తనకు తెలిసిన పని ద్వారా ఏదో రకంగా సేవ చేస్తుండేవారు. ఓసారి ప్రభుత్వాసుపత్రి వద్ద వేచి ఉన్నారు. భవన నిర్మాణ కార్మికులు కొందరు గాయాలతో ఆస్పత్రికి వచ్చారు. చికిత్స చేశాక తమ వద్ద మందులు లేవని బయట తెచ్చుకోమని వారికి ప్రిస్క్రిప్షన్‌ను సిబ్బంది ఇచ్చారు. వాటిని కొనేందుకు కూడా డబ్బులు లేక వెనుదిరుగుతున్న వారిని ఓంకార్‌నాథ్ ఆరా తీశారు. వాటికి బాగా ఖర్చు అవుతుందనే విషయం తెలిసి ఆయన ఆలోచనలో పడ్డారు. వారికి కావాల్సిన మందుల్ని చాలా మంది వాడకుండా చెత్తలో పడేస్తున్న విషయం గుర్తుకువచ్చింది. అలా పాడు చేయకుండా వీరికి అందివ్వగలితే అనే ఆలోచనే ఆయన్ను మూడేళ్ల నుంచి ఇంటింటికీ వెళ్లి మందులు సేకరించేలా చేసింది. న్యూఢిల్లీకి మెడిసిన్ బాబాగా మార్చింది. తొలుత ఈ కార్యక్రమాన్ని భిక్షాటన అని పొరపాటుపడి ఇంటివారు తప్పుబట్టారు. అయినా ఆయన తన పని తాను చేసుకుపోవడం చాలామంది పేదలకు మేలు జరగడం చూసి తమ తప్పు తెలుసుకున్నారు. 79 ఏళ్ల ఓంకార్‌నాథ్ ఇప్పుడు రోజూ 7 కిలోమీటర్ల దూరం నడుస్తూ మందుల్ని సేకరిస్తారు. ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో తిరుగుతూ ప్రతి ఇంటి తలుపూ తడతారు. అలా సేకరించిన మందుల్ని ఓ చోట కూర్చుని ఎక్స్‌పైరీ డేట్లు, మ్యానుఫాక్చరర్ పేరు, బ్యాచ్ నంబర్లు పరిశీలిస్తారు. నకిలీవి, ఎక్స్‌పైరీ అయిపోయిన మందుల్ని పారేస్తారు. మిగతావాటిని వాటి రకాలకు అనుగుణంగా పేరుస్తారు. తన ఇంటి పక్కనే ఓ అద్దె గదిలో వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తూ వాటి అవసరార్థులకు అందజేస్తారు. ఢిల్లీలోని ప్రతి ఇంటిలోను వందల రూపాయల విలువైన మందులు వృథా అవుతున్నాయని, ఓ రోజు 35 వేల రూపాయల విలువ చేసే క్యాన్సర్ మందుల స్ట్రిప్ ఒకటి వచ్చిందని ఆయన తెలిపారు. కేవలం జ్వరం బిళ్లలు, ఇన్సులిన్ ఇంజక్షన్ల వంటివే కాకుండా, ఆక్సిజన్ సిలిండర్లు, వీల్ చైర్లు, వాకర్లు, నెబ్యులైజర్లు కూడా ఆయన సేకరించి పేదలకు అందిస్తున్నారు.

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే వాటిని ఇస్తారు. ఇలా నేడు సుమారు 5 లక్షల రూపాయలకు పైనే విలువైన మందులను పేదలకు అందిస్తున్నారు. నగరమంతా ప్రైవేట్ క్లినిక్‌ల వద్ద ప్రత్యేక బాక్సులను ఏర్పాటు చేసి మందుల్ని సేకరిస్తున్నారు. అలా అందే ప్రతి మందుకు రికార్డు నిర్వహిస్తూ పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్త పడుతున్నారు. విజయవంతమైన ఈ కార్యక్రమాన్ని దేశమంతటా వ్యాపించాలన్నదే ఆయన లక్ష్యం. మెడిసిన్ బ్యాంకులను దేశమంతటా వ్యాప్తి చెందించి ఓ నెట్‌వర్క్‌లా మార్చాలన్నది ఆయన కల. తాను చేస్తోంది చిరు ప్రయత్నమే అయినా మిగతావారు స్ఫూర్తిపొంది మరో పెద్ద అడుగు వేయాలని ఆయన ఆశిస్తున్నారు.

మిగిలిపోయిన మందులు తీసుకుంటూ...

ఇస్తూ...

కాఫీ ఎగుమతిలో భారత్‌ది ప్రత్యేక స్థానం. విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి రప్పించడంలో పోటీ పడుతోంది. కానీ, ఇక్కడ కాఫీ టేస్టర్ల గురించి పెద్దగా తెలీదు. ఆసియా నుంచే తొలి మహిళా కాఫీ టేస్టర్‌గా పనిచేసిన సునాలిని మీనన్ మాట కూడా అదే. 70లలోనే కాఫీ టేస్టర్‌గా కెరీర్‌ను ఎంచుకున్న ఆమె చాలా అనుభవాల్ని గడించింది. నాలుగు దశాబ్దాలుగా భారత కాఫీకి మంచి రుచిని జోడిస్తూ అనేక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుంది.

ఓ కప్పు కాఫీ...

సునాలినీ మీనన్ కేరళకు చెందిన వ్యక్తి. కేరళ సుగంధ ద్రవ్యాలతో పాటు కాఫీ తోటలకు పేరు గడించింది. అక్కడే పుట్టి పెరిగిన మీనన్‌కు కాఫీ రుచి పసిగట్టడమనేది వెన్నతో పెట్టిన విద్య. కానీ, ఓ ప్రొఫెషనల్ కాఫీ టేస్టర్‌గా మారాలంటే అదీ ఆ రోజుల్లో మహిళకు పెద్ద సవాలే. భారత్‌లో పెద్దగా కాఫీ టేస్టింగ్ కోర్సుల జాడ కనిపించని కాలంలో విదేశాల్లోనే దానికి సంబంధించిన శిక్షణ తీసుకోవాల్సి వచ్చేది. మీనన్‌కు ఎదురైన తొలి సవాలిదే. విదేశాలు వెళ్లి కాఫీ టేస్టర్ కోర్సు చేసి వస్తానంటే దాని గురించి అవగాహన లేని వారంతా ఆమెను అపహాస్యం చేశారు. కుటుంబ ప్రోత్సాహంతో 1971లో జర్మనీ చేరుకుంది మీనన్. బెంగళూరు కాఫీ బోర్డు కప్ కాస్టింగ్ యూనిట్ వారితో చేరడంతో ఇది సాధ్యమైంది. జర్మనీ తర్వాత స్విట్జర్లాండ్ మరికొన్ని దేశాల్లో మరిన్ని కోర్సులు చేశాక ఆమె కాఫీ టేస్టర్‌గా మంచి పేరు సంపాదించుకుంది. తాను వెళ్లిన ప్రతి శిక్షణ కేంద్రంలో తన కట్టు బొట్టే తనని ప్రత్యేకంగా నిలిపేవి. అది కూడా అంతమంది బృందంలో తాను ఒక్కర్తే మహిళ. అదీ ఆసియా నుంచి వచ్చిన మహిళ. ఈ విషయంలో ఆమె గర్వపడతారు. శిక్షణ తదనంతరం కాఫీ బోర్డుకు పనిచేసిన ఆమెకు ప్రతి సమావేశంలోను స్థానం దక్కేది. కేవలం కాఫీ టేస్టర్‌గా సలహాలు ఇవ్వడానికే ఆమె పరిమితం కాకుండా కాఫీ తయారీ, గ్రెయిన్ క్వాలిటీల గురించి అధ్యయనం చేసేది. ఎంత ఎక్కువ జ్ఞానాన్ని సముపార్జించుకుంటే అంత ఎక్కువ గౌరవం దక్కుతుందని, కేవలం తమ పని వరకే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు కొత్త విషయాల్ని నేర్చుకోవాలని ఆమె అంటారు. కాఫీ టేస్టర్‌గా ఆమె కెరీర్ నల్లేరు మీద నడకలా ఏం సాగలేదు. చాలా ఎదురుదెబ్బలు, అవమానాల్ని ఎదుర్కొంది. తీరిక లేని పనివేళలతో సతమతమయ్యేది. చంటి బిడ్డలను సాకుతూనే కెరీర్‌ను మలుచుకుంది. వీటన్నింటినీ మనో నిబ్బరంతో ఎదుర్కుంటూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని కాఫీ ఇండస్ట్రీలో

సంపాదించింది.భారత్‌లో వైన్ టేస్టర్‌లకు సమానంగా కాఫీ టేస్టర్‌లకు స్థానం దక్కడంలో ఆమె పాత్ర కూడా ఉంది. దశాబ్దాలుగా ఆమె సాగించిన అధ్యయనాలే ఆమెను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాయనడంలో సందేహం లేదు. తన తొలి బాస్ హెచ్‌జీవీ రెడ్డి వంటి వారి ప్రోత్సాహం కూడా ఆమెకు బలాన్నిచ్చాయి. 1978 నుంచి కాఫీ కంట్రోల్ డివిజన్‌కు నేతృత్వం వహించిన ఆమె 1995లో కాఫీ బోర్డును విడిచారు. కాఫీల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కన్సల్టెన్సీని ప్రారంభించి తమ సేవల్ని విస్తరించారు. వినియోగదారులకు, కాఫీ తోటల పెంపకందారులు, కాఫీ స్కూళ్లకు ప్రత్యేక వర్క్‌షాప్‌లను నిర్వహించి కాఫీ మార్కెట్‌లో మార్పులకు కృషిచేశారు. తనలాంటి కాఫీ టేస్టర్‌లను తయారు చేస్తూ కాఫీ మార్కెట్ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు. సుమారు 70 నుంచి 75 శాతం కాఫీ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అందులోను భారత్‌కే ప్రత్యేకమైన అరబికా అనే తీయని ఫ్లేవర్, గాఢమైన రోబస్టా ఫ్లేవర్ స్ట్రెయిన్లు మరెక్కడా ఉత్పత్తి కావు. భారత్‌లో కొన్నేళ్ల క్రితం నుంచి కెఫేల సంస్కృతి విస్తరిస్తోంది. ఇది కాఫీ టేస్టర్‌లకు మరింత పనికల్పిస్తుంది. జపాన్ వినియోగదారుల కోసం మీనన్ మిగతా పదార్థాలతో కలగలిపి ప్రత్యేక కాఫీ ఫ్లేవర్స్‌ను సిద్ధం చేశారు. బీట్‌రూట్‌ను పోలిన చికరీని కలగలిపి చేసే కాఫీ నారింజ వర్ణంతో పాటు కారమెల్ చిక్కదనాన్ని కాఫీకి అందిస్తుంది. ఇలాంటి ప్రయోగాలన్ని కాఫీ టేస్టర్‌ల వల్లే వినియోగదారులకు రుచిని అందిస్తున్నాయి. చివరికి కాఫీ ఫిల్టర్‌లు, ఎలక్ట్రిక్ మెషీన్ల తయారీ విషయాల్లోను వీరి సేవలు అమూల్యం. ఇలాంటి కాఫీ టేస్టర్ రంగానికి ప్రత్యేక వన్నె తెచ్చిన మీనన్‌కు అనేక అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. ఈ ఏడాదే అమెరికా వారి స్పెషాలిటీ కాఫీ అసోసియేషన్ నుంచి ప్రఖ్యాత ఆల్ఫ్రెడ్ పీట్ పాజినేట్ కప్‌ను సియాటెల్ వెళ్లి అందుకున్నారు. మీనన్ కృషి వల్లే కాఫీ టేస్టర్లకు భారత కాఫీ బోర్డులలో గౌరవం పెరిగింది.

అక్కడే ఆగండి!

జపాన్ టోజింబో కొండల్లో ఆత్మహత్యలు కనిపించడంలేదు. సముద్రహోరులో నిండు ప్రాణాలు కలిసిపోవడంలేదు. అక్కడ నుంచి వెనుతిరిగిన ఓటమి జీవులు గొప్ప విజయంతో జీవితంలో మరో ఆత్మహత్యాయత్నం ఆలోచన చేయడంలేదు. ఇదంతా 'అక్కడే ఆగండి!' అని అరుస్తూ వెళ్లే 'చోట్టో మాట్టే' మనిషి ఇచ్చిన బలమే. 11 ఏళ్లుగా ఆత్మహత్యల నివారణకు అంకితమైన యుకియో షిగెహాస్ అనే 70 ఏళ్ల వృద్ధుడే ఆ 'చోట్టే మాట్టే' మనిషి.

జపాన్‌లో ఆత్మహత్యలు ఎక్కువవుతున్నాయి. పోటీ ప్రపంచంలో పడి పరుగు తీయలేక చాలా జీవితాలు శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్నాయి. జపాన్ సముద్ర తీరంలో ఉన్న టోజింబో కొండలు కూడా ఒకప్పుడు ఆత్మహత్యలకు చిరునామాగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి మారింది. అద్భుత పర్యాటక కేంద్రమైన ఆ ప్రాంతం ఆత్మహత్యలతో నిత్యం వార్తల్లో ఉండేది. ఆ పర్యాటక కేంద్ర పోలీసు అధికారిగా రక్షణ బాధ్యతల్ని చూస్తూ ఉండేవాడు యుకియో షిగెహాస్. నిరంతరం కొండల్లో కాపలా కాస్తూ విలువైన ప్రాణాల్ని కాపాడేవాడు.

కదిలించిన ఘటన

రిటైరయ్యాక కూడా ఆ ప్రాంతాన్ని వదల్లేదు యుకియో. దీనికో బలమైన కారణం ఉంది. రిటైరయ్యాక హాయిగా విశ్రాంత జీవితం గడుపుతున్న యుకియోకి ఓ రోజు పోలీసుల నుంచి ఫోన్ వచ్చింది. తన ప్రాణ మిత్రుడు కొండపై నుంచి సముద్రంలోకి కారును దూకించి ఆత్మహత్య చేసుకున్నాడనేది వార్త. ఆ దుర్వార్త అతడిని బాగా కుంగదీసింది. మిత్రుడి కుటుంబం ఆ విషాదం నుంచి బయటపడలేదు. ఈ విషయం యుకియో మనసును మరింత కలచివేసింది. ఓ వ్యక్తి చనిపోతే చాలా మంది జీవితాలు చిన్నాభిన్నం అవుతాయనే విషయాన్ని గుర్తించాడు. అప్పటి నుంచి ఆ కొండల్లో ఎవరైనా ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తే ఆయన వెంటనే అడ్డుపడేవాడు.

చోట్టో మాట్టే...

ఆత్మహత్య చేసుకునేవారి మనస్తత్వం యుకియోకు బాగా తెలుసు. రిటైర్‌మెంట్‌కు ముందు .. అంటే విధి నిర్వహణ చివరి రోజున ఆత్మహత్య యత్నం చేస్తున్న ఓ వృద్ధ జంటను ఆయన నిలువరించాడు. వారిని హుటాహుటిన సంరక్షణ సంస్థకు అప్పగించాడు. పబ్‌ను నిర్వహిస్తూ పీకల్లోతూ అప్పుల్లో కూరుకుపోయిన వారు సమస్య తీరేందుకు మార్గం కనబడక ఆ తర్వాత ఐదు రోజులకే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనే యుకియో వైఖరిని మార్చింది. కేవలం సంరక్షణ కేంద్రాలకు తరలించడం వల్ల వారి ఆలోచనల్లో మార్పు రాదని, వారి సమస్యను పరిష్కరించేందుకు గట్టిగా నిలబడగలిగితేనే ఆత్మహత్య ఆలోచన విరమించుకుంటారని అర్థమైంది. మరో ఘటనలో ఓ యువతి ఆత్మహత్య యత్నాన్ని ఆపేందుకు పోలీసులు రంగప్రవేశం చేశారు. అర్థగంట పాటు వారు పదేపదే ఆమె తల్లిదండ్రుల గురించి ప్రస్తావించారు. అయినా ఆమె వెనక్కు తగ్గలేదు. చివరకు ఒక్కసారిగా 'సాయనోరా' అంటూ సముద్రంలోకి దూకి ప్రాణాల్ని విడిచింది. విషయం తెలిసి అక్కడకు యుకియో చేరుకునే సరికే ఘోరం జరిగిపోయింది. అమ్మానాన్నలు, పిల్లలు, కుటుంబం వంటి భావోద్వేగ విషయాల బదులు ఆమె సమస్యను ఆరాతీసి తగిన సాయం అందిస్తామని భరోసా ఇవ్వాలని పోలీసులను చీవాట్లు పెట్టాడు యుకియో. ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు తీవ్రమైన ఒంటరితనంతో బాధపడుతుంటారు. చుట్టూ అయినవారు ఉన్నా వారి సమస్యలను ఎవరూ పరిష్కరించలేరని నిశ్చితాభిప్రాయానికి వస్తారు. చావు ఒక్కటే వారి సమస్యకు పరిష్కారమని భావిస్తారు. ఆ సమయంలో వారికి అండ దొరికితే ఆత్మహత్య అనే మాటే ఉండదని యుకియో అంటారు. వారి సమస్యలు తీర్చడంలో తాను అండగా నిలబడతానని ధైర్యాన్నిస్తాడు. కేవలం మాటలకే పరిమితం కాక బాధితుల పక్షాన పోరాడతాడు కూడా. యుకియో రక్షించినవారిలో కొందరు ఆఫీస్ వ్యవహారాల వల్ల ఆత్మహత్యకు ప్రేరేపితులయ్యారని తెలుసుకుని వారు పనిచేసే చోటకే నేరుగా వెళ్లి బాధ్యులను హెచ్చరించాడు. నిలువ నీడలేని వారికి తన అపార్ట్‌మెంట్లలో వారు నిలదొక్కుకునేంత వరకు ఆశ్రయం కల్పిస్తాడు. రుణ బాధలున్నవారికి చట్ట సహాయం అందిస్తాడు. ఉద్యోగాలు లేనివారికి స్వచ్ఛంద సంస్థల సాయంతో పని కల్పిస్తాడు. వ్యక్తిగత సంబంధాల్లో సమస్యలున్నవారికి కౌన్సెలింగ్ ఇప్పిస్తాడు. ఇలా ప్రతి సమస్యకు ఒక పరిష్కారాన్ని అందించి 500 మందికి పైగా ప్రాణాల్ని కాపాడాడు. వారి కుటుంబాల వ్యథను తొలగించాడు. అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా 'చోట్టో మాట్టే' (అక్కడే ఆగండి) అని అరిచే ఆయనకు ఆ పేరే స్థిరపడిపోయింది. తనకు తోడుగా మరో ముగ్గురు వలంటీర్లను కలుపుకుని పనిచేసే యుకియోను స్థానికులు దేవదూతగా భావిస్తారు. 11 ఏళ్లుగా టోజింబో కొండలకే అంకితమైపోయిన ఆయనకు చాలా అమూల్యమైనవి బైనాక్యులర్స్. వాటితోనే ఆయన ప్రాణాలకు గస్తీ కాస్తుంటాడు. ✦

యుకియో

దక్షిణ శిఖ కోజికోడ్‌లోని ఆ ఇంట ఉత్తరాది స్వచ్ఛమైన హిందుస్తానీ రాగాలతో మెహ్‌ఫిల్ సాయంత్రాలు విరబూస్తాయి. ఆపాత మధురాలతో నిండిన గ్రామఫోన్ రికార్డుల మంద్ర శబ్దం ఆ వీధికి కొత్త శోభనిస్తుంది. రేడియో కోయాగా సుపరిచితుడైన హైద్రోస్ కోయా నాలుక చివరే క్లాసిక్స్ అన్నీ ఆడుతుంటాయి. రఫీ గీతాలు, నజ్మల్ బాబు గజల్స్ వాటి పుట్టుక, సినిమా చరిత్ర ఒక్కటేమిటి అన్నింటినీ టకటకా చెప్పే హైద్రోస్ దగ్గర క్లాసిక్స్ ఖజానా చాలానే ఉంది.

క్లాసిక్స్ ఖజానా

- ఎన్.ఎస్ సజిత్

కిన్నసెరిలోని రేడియో కోయా రేడియో మెకానిక్‌గా చేసేవాడు. రేడియో మెకానిక్‌గా మారడానికి కారణం ఆయన ఆరాధ్య గాయకుడు రఫీ గీతాలు వినడానికే. రఫీ గొంతు వినేందుకు వృత్తినే మార్చుకున్నాడంటే ఎంత అభిమానో అర్థం అవుతుంది. రఫీతో పాటు పంకజ్ మల్లిక్, సైగల్ గీతాల వంటి మిగతా బాలీవుడ్ క్లాసిక్స్ అన్నా, హిందుస్థానీ గజల్స్ అన్నా చెవికోసుకుంటాడు. చిన్నతనంలో తన తండ్రి దగ్గర ఓ గ్రామఫోన్ ఉండేది. దాని దగ్గరే ఉంటూ గీతాలను ఆస్వాదించేవాడు. అలా దానితో ప్రేమలో పడిపోయిన కోయా ఆ తర్వాత గ్రామఫోన్ రికార్డులను సేకరించడం మొదలెట్టాడు. ఇలా 4000 ఒరిజినల్ రికార్డులను నేటికీ చాలా జాగ్రత్తగా భద్రపరుస్తున్నాడు. పాడైన రికార్డంటూ అక్కడ కనబడదు. అన్నీ కొత్తగా ఇప్పుడే కొన్న వాటిలా ఉంటాయి. కోయా అరుదైన గ్రామఫోన్లను, రేడియోలను సేకరించారు. ఫిలిఫ్స్ హోల్యాండ్, ములార్డ్ ఇంగ్లండ్, మర్ఫీ 8 బ్యాండ్, రేడియోగ్రామ్ ఆఫ్ జపాన్‌తో పాటు ఇంగ్లండ్ నుంచి తెచ్చిన అనేక గ్రామఫోన్ రికార్డులు ఆయన దగ్గర ఉన్నాయి. ఇప్పటికీ అవి కొత్తవాటిలానే పక్కాగా పనిచేస్తున్నాయి. కోయా రేడియోలో బాలీవుడ్ క్లాసిక్స్ గురించి సమాచారం ఇస్తూ, ఆయా గీతాల ప్రస్తావన, వాటి గొప్పదనం చెబుతూ శ్రోతల్ని అలరించేవాడు. అలా ఆయనకు రేడియో కోయాగా పేరు స్థిరపడిపోయింది. 60 ఏళ్లు పైబడిన కోయా 25 ఏళ్ల నుంచి ఓ కొత్త సాయంత్రాలను కోజికోడ్ ప్రజలకు పరిచయం చేశాడు. 'పురానీ గీత్ సాథియోన్' పేరిట ప్రతి ఆదివారం తనలాగే క్లాసిక్స్‌ను ఇష్టపడే వారితో సంగీత కచేరీలు తన ఇంట నిర్వహిస్తున్నాడు. ఈ కచేరీలకు ముక్కుమొఖం తెలీని వారూ హాజరై ఆ సంగీత ఝరిలో మునిగిపోతారు. కొందరు కేవలం ఈ మెహ్‌ఫిల్ సాయంత్రాల కోసం ఊరు మారి ఇక్కడకు వచ్చారు. ఇందులో భిన్న తరాలకు, వృత్తులకు చెందినవారు ఉంటారు. వారందరినీ ఏకం చేసేది కోయా ఇంట ప్రతిధ్వనించే సంగీతమే. వస్త్ర దుకాణం యజమాని అయిన 32 ఏళ్ల అలీ తన స్వరంలో రఫీని మోసుకొస్తాడు. గజల్స్, భజన్స్‌నూ అలవోకగా పాడే అలీకి కోయా అంటే చెప్పలేనంత అభిమానం. రఫీని నరనరాన ఎక్కించుకున్న కోయా ఆయన విశేషాలు చెబుతుంటే చెవి రిక్కించి వింటాడు అలీ. రఫీలానే పాడావు అని కోయా మెచ్చుకోలుకు తపించి గీతాలాపన చేస్తాడు. బేపూర్ నుంచి ఇల్లు సర్దేసి వచ్చిన భవన నిర్మాణ కార్మికుడు కబీర్ ఖాన్ 12 ఏళ్లుగా హార్మోనియంతో ఆ ఇంటికి వాద్య సన్మానం చేస్తున్నాడు. బ్యాంకు ఉద్యోగి ముజీబ్ తనకు నచ్చిన గీతాల క్యూని అందిస్తాడు. ఆ ఆదివారం సాయంత్రాలు తమ జీవితంలో విడదీయలేని భాగాలైపోయాయని కబీర్ అంటాడు. కోయా ప్రాణ మిత్రుడు 80 ఏళ్ల హమీద్ భాయ్ సైగల్ గీతాలతో పురానీ గీత్ మహల్ చేసేస్తాడు. ప్రఖ్యాత మప్పిలపట్టు గాయకుడు సీఏ అబుబాకర్ కొడుకు సీఏ సలీం తబలా తోడునందిస్తాడు. పాటల మధ్యలో వాటి సమాచారాన్ని, విశేషాలను చెబుతుంటాడు కోయా. శ్రోతలు అడిగే ప్రశ్నలకు వెంటనే సమాధానమిచ్చే కోయాను క్లాసిక్స్ గూగుల్ అని అంటారు. ఎవరైనా శ్రోతలు ఏదైనా ప్రత్యేక గీతాన్ని అడిగినా, రాగాలాపనలో కానీ సాహిత్యంలో గానీ సందేహాలు వస్తే అన్ని వేల రికార్డుల నుంచి సరైన దాన్ని ఇట్టే గుర్తించి గ్రామఫోన్లో వినిపిస్తాడు. సుదూరాల నుంచి ప్రత్యేక ప్రయాణం కట్టి వచ్చి ఈ కచేరీల్లో వారాలకు వారాలు గడిపేవారున్నారు. ఆ ఇరుకైన ఇల్లే విశాలమైన సంగీత మహల్‌లా తోస్తుంది సంగీతప్రియులకు. అక్కడ కాసింత చోటు దొరికినా చాలని అనుకుంటారు. ఇలా రేడియో కోయా ఇల్లు విభిన్న సంగీత తరాలను, ధృవాలను కలిపే కేంద్రమైంది.

అణు శక్తి... ఈ పేరు వినగానే కొందరికి అణు బాంబులు గుర్తుకొస్తాయి. మరి కొందరికి అణు విద్యుత్ మదిలో మెదులుతుంది. ఇంకొందరికి మానవాళికి ముందున్న అణు విపత్తులు గుర్తుకొస్తాయి. నిజానికి ఈ మూడూ కలిస్తే అణు శక్తి.

అణు తంత్రం

- ఎస్. వెంకట్రావు

అణు శక్తి లేనిదే మానవాళి మనుగడ లేదు. ఈ భూమ్మీద మనకు ఆహారం, ఇంధనం అందుతున్నదంటే, మనం నివసించడానికి తగిన ఉష్ణం, వాతావరణం లభిస్తున్నదంటే అదంతా అణు శక్తి వల్లే. అయితే ఈ అణు శక్తి మన భూమ్మీద నుండి లభిస్తున్నది కాదు. సూర్యుని నుండి వస్తున్నది. సూర్యుడు వేల డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రతతో భగభగ మండుతున్న ఒక నక్షత్రం. నక్షత్రాలు అలా మండడానికి కారణం వాటిలో హైడ్రోజన్ పరమాణు సంవేదన (ఫ్యూజన్) క్రియలు జరగడమే. మన సూర్యునిలో కూడా కొన్ని వేల హైడ్రోజన్ బాంబులు ఒకే సారి పేలితే ఎంత శక్తి విడుదలవుతుందో ప్రతి నిత్యం అంత శక్తి విడుదలవుతుంది. ఆ శక్తి అన్ని వైపులా వెదజల్లబడుతుంది. అందులో కొన్ని కిరణాలు భూమిని చేరి ఇక్కడ వేడి, వెలుతురునిస్తున్నాయి. దాని నుండే మనం బతకడానికి కావలసిన శక్తి లభిస్తోంది.

19వ శతాబ్దం వరకు మనిషికి ఈ అణు శక్తి గురించి ఇదమిత్థంగా తెలియదు. ఆ శతాబ్దం ప్రారంభంలో శక్తి నిత్యత్వ సూత్రాన్ని కనుగొన్నారు. అంటే శక్తి ఒక రూపం నుండి మరో రూపానికి మారుతుంది గానీ అది నశించదు, సృష్టించబడదు. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టయిన్ ప్రముఖ సూత్రం $e=mc^2$ ద్వారా పదార్థం శక్తిగా, శక్తి పదార్థంగా మారుతుందని తెలిపారు. అంటే పదార్థం కూడా నశించదన్న మాట.

20వ శతాబ్దం ఆరంభం నుండి పదార్థంలోని ఆ శక్తిని వెలికి తీసే పరిశోధనలు బాగా ఊపందుకున్నాయి. అయితే అణుశక్తిని మొట్టమొదటి సారిగా వెలికి తీసి ఉపయోగించింది మానవాళి మేలు కోసం కాదు. వినాశనానికి. అణు బాంబు రూపంలో మొదటి సారిగా అణుశక్తి వెలువడింది. ప్రపంచ యుద్ధ తంత్రంలో భాగంగా అది ఉత్పత్తి అయింది.

రెండవ ప్రపంచ యుద్ధంలో అణుబాంబు తయారీ

రెండవ ప్రపంచ యుద్ధంలో సంప్రదాయ ఆయుధాలు కోట్ల మంది ప్రజల ప్రాణాలు తీశాయి. నాజీ జర్మనీ, ఇటలీ, జపాన్‌ల ఫాసిస్టుల త్రయం ఒకవైపూ, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్లతో కూడిన మిత్ర రాజ్యాలు మరోవైపూ మోహరించాయి. ఈ సమయంలో ఎవరు ముందుగా అణుబాంబు తయారు చేస్తే విజయం వారిదే. అణుబాంబు ఉత్పత్తికి కావలసిన ప్రాథమిక పరిశోధనలు నాజీ జర్మనీలో ఊపందుకున్నాయి. దాన్ని అధిగమించి తొందరగా అణు బాంబు ఉత్పత్తి చేయాలని అమెరికా ప్రయత్నాలు ప్రారంభించింది. బ్రిటన్, కెనడాలతో కలిసి 1942లో బాంబు ఉత్పత్తి ప్రారంభించింది. దానికి మ్యాన్‌హట్టన్ ప్రాజెక్టు అని పేరు పెట్టారు. అణు బాంబు ఉత్పత్తికి విపరీతమైన సాధన, సంపత్తి కావాలి. యుద్ధ రంగానికి దూరంగా ఉన్న అమెరికాకు అటువంటి అవకాశం చిక్కింది. దాంతో అది ముందుగా అణు బాంబు తయారు చేయగలిగింది.

అణుబాంబును యురేనియమ్ 235 మూలకం నుండి తయారు చేస్తారు. యురేనియమ్ 235 పరమాణువులను న్యూట్రాను రేణువు ఢీ కొట్టినప్పుడు



హీరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు 'లిటిల్ బాయ్'

అణుబాంబు బాధితులు

అణువు విచ్ఛిన్నమై శక్తి వెలువడుతుంది. విచ్ఛిన్నమైన ఒక్కో యురేనియమ్ పరమాణువు నుండి రెండు లేక మూడు న్యూట్రాన్లు విడుదలవుతాయి. ఇవి మళ్లీ పక్కనే ఉన్న యురేనియమ్ పరమాణువులను ఢీకొంటాయి. ఆ విధంగా గొలుసుకట్టు చర్య జరిగి బ్రహ్మాండమైన శక్తి విడుదలవుతుంది. అంతా కొన్ని సెకన్లలో జరిగిపోతుంది. అయితే యురేనియమ్‌లో ఈ గొలుసు కట్టు చర్య జరగాలంటే దాని పరిమాణం ఒక స్థాయిలో ఉండాలి. దాన్నే క్రిటికల్ మాస్ అంటారు. యురేనియమ్ గొలుసుకట్టు చర్య గురించి 1933లోనే తెలుసుకున్నారు. అమెరికా శాస్త్రవేత్తలు 1942 డిసెంబరులో మొట్టమొదటి కృత్రిమ అణు గొలుసుకట్టు చర్యను ప్రయోగశాలలో పరిశీలించారు. మొట్టమొదటి అణుబాంబు పరీక్షను 1945 జులై 16 అమెరికా నిర్వహించింది. దీనికి ట్రినిటీ అని పేరుపెట్టారు.

యుద్ధంలో విజయం కోసం అమెరికా అణుబాంబు తయారీని శీఘ్రతరం చేసింది. కానీ అది మొదటి సారి బాంబును పరీక్షించే సరికే యుద్ధం దాదాపు ముగిసింది. 1945 మే 2న హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. 9న జర్మనీ లొంగిపోయింది. ఇటలీ రెండేళ్ల ముందే లొంగిపోయింది. జపాన్ కూడా లొంగిపోతున్నట్లు సంకేతాలు పంపింది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాకు జపాన్‌పైనగానీ, మరో దేశం మీదగానీ అణు బాంబులు వేయాల్సిన అవసరమే లేదు. అయినా అమెరికా పాలకులు అణు బాంబులు వేయడానికే. అది కూడా సైనిక స్థావరాలమీద కాకుండా జనావాసాల మీద వేయడానికే నిర్ణయించారు. అణుబాంబు తయారీలో కీలకంగా ఉన్న కొందరు శాస్త్రవేత్తలు జనావాసాల మీద బాంబు వేయడాన్ని వ్యతిరేకించారు. అయితే అమెరికా పాలకులు శాస్త్రజ్ఞుల మాట చెవినెక్కించుకోలేదు. కారణం వారి ముందున్న రాజకీయ వ్యూహాలే. జపాన్‌పై అణుబాంబులు వేయడం ద్వారా యుద్ధానికి ముగింపు పలికామని అమెరికా చెబుతున్నా అసలు కారణాలు వేరే ఉన్నాయని తరువాత పరిణామాలు స్పష్టం చేశాయి. మొదటిది, జపాన్‌లోని జనావాసాల మీద అణు బాంబులు వేయడం ద్వారా అక్కడ జరిగిన మానవ విధ్వంసాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవాలి. రెండవది, అటువంటి విధ్వంసకర బాంబు తన వద్ద ఉందన్న విషయం తెలియజెప్పడం ద్వారా యుద్ధంలో తన మిత్ర పక్షంగా ఉన్న కమ్యూనిస్టు సోవియట్ యూనియన్ రెడ్ ఆర్మీ పురోగమనాన్ని నిలువరించడం కోసం దానికి ఒక హెచ్చరిక చేయాలి. మొదటిది, పరిశీలన (వేల మంది ప్రాణాలు పణంగా పెట్టి),
రెండోది రాజకీయ యుద్ధ తంత్రం.

ఆగస్టు 6న హిరోషిమా మీద, ఆగస్టు 9న (70 ఏళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున) నాగసాకీ నగరాలపై అణుబాంబులు వేసిన అమెరికా అక్కడ జరిగిన విధ్వంసాన్ని ఫోటోలు తీసింది. ఒక్కో రకమైన భౌగోళిక పరిస్థితులున్న నగరంపై అణు విధ్వంసం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి అవసరమైన అన్ని హంగులతో ఈ బాంబు దాడులు చేసింది. హిరోషిమా సమతలమైన నేల గల నగరం. నాగసాకిది ఎత్తుపల్లాలతో కూడిన నేల. అమెరికా ప్రభుత్వం నియమించిన 'టార్గెట్ కమిటీ' ఈ నగరాలను ఎంపిక చేసింది. నిజానికి హిరోషిమా కాకుండా జపాన్‌లో రెండో అతి పెద్ద నగరమైన క్యోటోపై దాడికి అణుబాంబులతో కూడిన అమెరికా బి-2 బాంబరు విమానాలు వెళ్లాయి. కానీ క్యోటో నగరం మీద మబ్బు కమ్మి ఉంది. బాంబింగ్ అనంతరం ఫోటోలు తీయడానికి ఆ వాతావరణం బాగాలేదు కనుక యుద్ధ విమానాలు హిరోషిమా వైపు మళ్లాయి. హిరోషిమాపై వేసిన బాంబు పేరు 'లిటిల్ బాయ్'. బాంబు మొత్తం బరువు సుమారు 4.5 టన్నులు కానీ అందులోని విస్ఫోటన పదార్థమైన యురేనియం 235 బరువు 6.5 కిలోలు మాత్రమే. ఈ పదార్థంలో రెండో వంతుకన్నా తక్కువ మాత్రమే పేలింది. సరిగ్గా ఉదయం 8.15 నిమిషాలకు బాలబాలికలు పాఠశాలకు, పెద్దలు విధులకు వెళ్లే వేళ నగరం నడిబడ్డున బాంబు పడింది. మరు క్షణం భయంకరమైన శబ్దం. పుట్టగొడుగులాగా మేఘాలు పైకి లేచాయి. 16 చదరపు కిలోమీటర్ల అగ్ని గోళం భవనాలు, వంతెనలు అన్నిటినీ నేలమట్టం చేసింది. 70,000 మంది ప్రజలు మొదటి రోజు చనిపోయారు. లక్షమంది వరకు రెండు మూడు మాసాల్లో చనిపోయారు. మరో లక్ష మంది గాయపడ్డారు. రెండు తరాల వరకు రేడియేషన్ ప్రభావంతో హిరోషిమా వాసులు రోగాలబారిన పడి చనిపోతూనే ఉన్నారు. మూడు రోజుల తరువాత నాగసాకీ నగరంపై మరింత శక్తివంతమైన ప్లూటోనియం బాంబు వేసింది. ఇక్కడ 27శాతం భవనాలు నాశనమైనాయి. 50,000 మంది వెంటనే, రెండు మూడు మాసాల్లో లక్షమంది వరకు చనిపోయారు.

ఇక ఈ అణుబాంబు ప్రయోగం వెనుక అమెరికా రాజకీయ వ్యూహం మరింత లోతైనది. పడమటి వైపు జర్మనీని ఓడించిన సోవియట్ ఎర్రసేన మరో వైపు జపాన్ భరతం పట్టడానికి పురోగమిస్తోంది. అప్పటికే కొరియా విముక్తిగావడం, చైనాలో కమ్యూనిస్టు తిరుగుబాటు తీవ్రం గావడంతో గంగ వెర్రులెత్తిన అమెరికా ఎర్రసేన పురోగమనాన్ని నిలువరించడానికే అంతమంది ప్రాణాలు బలిగొంటూ ఈ వికృతమైన బాంబు దాడికి పాల్పడింది. అప్పటికి సోవియట్ వద్ద అణుబాంబు లేదు. యుద్ధంలో సోవియట్ మిత్రపక్షంగా ఉన్నా తను అణుబాంబు తయారు చేస్తున్న విషయాన్ని చెప్పకుండా అమెరికా రహస్యంగా అట్టిపెట్టింది.

అణుయుగం

మొత్తం మీద హిరోషిమా, నాగసాకీ దాడులు అణుశక్తి ప్రభావాన్ని మానవాళికి ప్రత్యక్షంగా చూపించాయి. దాంతో అణు శక్తి అనేది అభివృద్ధికీ, జాతి గొప్పదనానికీ నిదర్శనంగా, ఆధునికతకు చిహ్నంగా మారింది. అమెరికాలో అణు ఇంధనం అనేది కలల ప్రపంచంగా మారింది. రానున్న కాలంలో విద్యుత్ జనరేటర్లన్నీ అణు ఇంధనంతోనే నడుస్తాయని అనుకునేవారు. యుద్ధంలో సంప్రదాయ ఆయుధాలకు కాలం చెల్లిందనీ, బొగ్గు, చమురుతో నడిచే విద్యుత్ కేంద్రాలను ఇక

మూసేయాల్సిందేనని చెప్పేవారు. అణుయంత్రాలు వస్తాయి, అన్ని పనులు చేసి పెడతాయనేవారు. ఉప్పు నీటి నుండి మంచి నీరు తీయడానికీ, ఎడారులను సస్యశ్యామలం చేసేందుకు సాగునీరు పారించడానికీ, గ్రహాల మధ్య ప్రయాణం చేయడానికీ.. అన్నిటికీ అణు ఇంధనం ఉపయోగపడుతుందనేవారు. మానవజాతి చరిత్రలో కంచు, ఇనుప యుగాలు ఎలాంటివో అణుయుగం కూడా అలాంటిదని చెప్పేవారు. కొందరైతే అణు ఇంధనంతో నడిచే విమానాలొస్తాయని భావించారు. ఈ ఊహలు సాకారం చేసేందుకు అమెరికా ప్రభుత్వం అప్పట్లో 150 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. చాలా మంది ప్రయివేటు వ్యాపారులు అణు ఇంధన రంగంలోకి ప్రవేశించారు. అణు ఇంధన నియంత్రణ కోసం అమెరికా ప్రభుత్వం అణు ఇంధన కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అణు విద్యుత్ ఎంత చౌకగా వస్తుందంటే భవిష్యత్తులో వినియోగదారులనుండి మనం ఛార్జీలే వసూలు చేయనవసరం లేదు అని కొందరు అమెరికా రచయితలు రాశారు. కానీ వాస్తవంగా 1957లో అమెరికాలో మొదటి అణు రియాక్టరు-షిప్పింగ్ పోర్టు రియాక్టర్ ఉత్పత్తి ప్రారంభించేనాటికి అణు విద్యుత్తు ఖరీదు మామూలు విద్యుత్తుకన్నా 10 రెట్లు ఎక్కువ ఉంది. ఈ రియాక్టర్‌లో ప్రమాదం జరిగితే వెంటనే 3000 మంది చనిపోతారనీ, 40,000 మంది గాయపడతారనీ అమెరికా ఇంధన కమిషన్‌కు చెందిన బ్రూఖవెన్ లాబొరేటరీ శాస్త్ర వేత్తలు అంచనా వేశారు.

అణ్వాయుధ పోటీ

హిరోషిమా, నాగసాకి బాంబుదాడితో ప్రపంచంలో అణ్వాయుధ పోటీ విపరీతంగా పెరిగింది. అమెరికాలో బాంబు తయారీలో పాల్గొన్న చాలా మంది శాస్త్రవేత్తలు అణు ఇంధనంపై అంతర్జాతీయ నియంత్రణ ఉండాలని వాదించారు. అణు పరిశోధన విషయాలు అన్ని దేశాలకూ పారదర్శకంగా అందాలని కోరారు. అయితే అమెరికా పాలకులు మాత్రం అణు ఇంధనంపై తమకు ఆధిపత్యం ఉండాలని గట్టిగా కోరుకున్నారు. దాంతో జపాన్‌లో విధ్వంసాన్ని ప్రత్యక్షంగా చూసిన ఇతర దేశాలు ముఖ్యంగా సోవియట్ యూనియన్ అణుబాంబుల కోసం పోటీపడ్డాయి. సోవియట్ యూనియన్ 1949లో తొలి అణుబాంబు పరీక్ష జరిపింది. దాంతో అమెరికాలో భయం పట్టుకుంది. సోవియట్‌పై పైచేయి కోసం అమెరికా 1952లో మరింత శక్తివంతమైన హైడ్రోజన్ బాంబు తయారు చేసింది. అణు బాంబుల్లో రెండు రకాలున్నాయి. ఇంతవరకు మనం చెప్పుకున్న బాంబులను అణువిచ్ఛిత్తి (ఫిజన్) బాంబులంటారు. అంటే యురేనియం లేక ప్లూటోనియం పరమాణువులు విచ్ఛిన్నం చెందడంవల్ల శక్తి విడుదలవుతుంది. హైడ్రోజన్ బాంబుల్లో అణు సంయోగం జరుగుతుంది. అందుకని వీటిని ఫ్యూజన్ బాంబులు అంటారు. అయితే అణు సంయోగం జరగాలంటే ముందుగా దానికి విపరీతమైన వేడి కావాలి. అంటే ఫ్యూజన్ ప్రక్రియకు ముందు ఫిజన్ ప్రక్రియ జరగాలి. సూటిగా చెప్పాలంటే అణుబాంబు పేలితే వచ్చే వేడితో హైడ్రోజన్ బాంబు పేలుడు జరుగుతుందన్న మాట. ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ. కానీ దీనివల్ల వచ్చే విధ్వంసకర ప్రభావం అణుబాంబుకన్నా అనేక వందల రెట్లు ఎక్కువ ఉంటుంది. దాంతో అణు బాంబు తరువాత హైడ్రోజన్ బాంబు పోటీ పెరిగింది. సోవియట్ యూనియన్ 1955లో తొలి హైడ్రోజన్ బాంబు పేల్చింది. బాంబు తయారు చేయడంతో బాటు వాటిని తీసుకుపోయే వాహనాల వేగం, స్థాయి పెంపులో కూడా పోటీ ఏర్పడింది.

హిరోషిమా, నాగసాకి బాంబులను బి-2 బాంబరు విమానాలపై మోసుకుపోయి జారవిడిచారు. కానీ తరవాత అమెరికా మరింత శక్తివంతమైన విమానాల తయారీకి పూనుకుంది. అంతరిక్షంలోకి వెళ్లే రాకెట్లను కూడా అణు బాంబులను మోసుకుపోడానికి ఉపయోగించడం ప్రారంభించింది. ఇలా రక్షణ రంగంలో ఉపయోగించే రాకెట్లను క్షిపణులు అంటారు. తొలుత 20-30 కిలోమీటర్లు భూ ఉపరితలం మీద తీసుకుపోయే క్షిపణుల స్థానంలో వేల కిలోమీటర్లు తీసుకుపోయే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసిబిఎం) తయారైనాయి. ఇందులో కూడా సోవియట్ యూనియన్ అమెరికాకు ధీటుగా ఐసిబిఎం లు తయారు చేసింది. దాంతో నీటి మీదనుండి నీటిమీదికి, నేలమీదికి ప్రయోగించే జలాంతర్గామి క్షిపణులను అమెరికా చేసింది. సోవియట్ కూడా వాటిని రూపొందించింది. ఈ విధంగా అమెరికా-సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ఆయుధ పోటీ నడిచింది. చివరికి ప్రచ్ఛన్న యుద్ధం తారాస్థాయిలో ఉన్న 1960 దశకం చివరి నాటికి అమెరికా 70,000 వరకు అణు బాంబులు తయారుచేసి ప్రపంచంలోని వివిధ ఖండాల్లో సముద్రాల మీద, సముద్ర గర్భంలో మోహరించగా, సోవియట్ యూనియన్ 45,000 వరకు బాంబులు తయారు చేసింది. నిజానికి రెండు దేశాల దగ్గర ఉన్న అణు బాంబులు పేల్చితే ఈ భూమిని ఒకసారి కాదు వంద సార్లు నాశనం చేయవచ్చు. ఒకసారి బాంబు వేస్తే రెండోసారి బాంబులు వేయడానికి ఎవరూ ఉండరనుకోండి!

అమెరికా ప్రారంభించిన అణ్వస్త్ర పోటీ ప్రపంచ వ్యాపితమైంది. తరువాత బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, ఇజ్రాయిల్, భారత్, పాకిస్థాన్, ఉత్తర కొరియాలు కూడా అణ్వస్త్ర పరీక్షలు జరిపాయి. తమ ఆయుధాల పొదిలో అణ్వస్త్రాలను సమకూర్చుకోవడం ప్రారంభించాయి. 1980వ దశకంలో అమెరికా, సోవియట్ యూనియన్ల మధ్య కుదిరిన ఒప్పందాలవల్ల రెండు దేశాలూ తమ వద్ద ఉన్న అణు బాంబుల సంఖ్య తగ్గించుకున్నప్పటికీ ఇంకా వాటి వద్ద ఉన్న అణు బాంబులు ఈ ప్రపంచాన్ని వందసార్లు నాశనం చేయడానికి సరిపోతాయి.

భారత్ - పాక్ అణ్వస్త్ర పోటీ

1950, 60, 70 దశకాల్లో అమెరికా, సోవియట్ యూనియన్ల మధ్య జరిగినట్లే ఇప్పుడు భారత్ పాకిస్థాన్‌ల మధ్య అణ్వస్త్ర పోటీ జరుగుతోంది. భారత దేశం తొలిసారిగా 1974లో రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో అణ్వస్త్ర పరీక్ష జరిపింది. దీనికి 'స్మైలింగ్ బుద్ధ' అని పేరుపెట్టింది. భారత్‌తో పోటీగా పాకిస్తాన్ కూడా అణ్వస్త్ర తయారీకి ఉపక్రమించింది. అమెరికా దానికి రహస్యంగా సహకరించింది. దానికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో స్మగ్లింగ్ ద్వారా పాకిస్తాన్ అణు పరికరాలు సంపాదించగలిగింది. పోఖ్రాన్1 అణు పరీక్షల తరువాత అమెరికా భారత్‌పై తీవ్రమైన ఆంక్షలు విధించింది. దాంతో మన దేశం అణు స్వావలంబన కోసం ప్లూటోనియం, థోరియం ఇంధనాలు వినియోగించుకునే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ప్రారంభించింది. ఇంతలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం


నెవడా, అమెరికా


ట్రినిటీ


స్మైలింగ్ బుద్ధ

1998 మే 11న పోఖ్రాన్‌లో ఒక్కసారిగా అయిదు అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించింది. భారత్‌కు పోటీగా కొద్ది రోజుల్లోనే పాకిస్థాన్ రాస్ ఖో కొండల్లో ఆరు అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించింది. దాంతో భారత్ పాకిస్తాన్‌ల మధ్య అణ్వస్త్ర పోటీ తీవ్రమైంది. అప్పటినుండి ఆ అణు బాంబులు మోసుకుపోయే క్షిపణుల తయారీలో కూడా ఇరు దేశాల మధ్య పోటీ సాగుతోంది. భారత్ అగ్ని, పృథ్వి, ఆకాశ్ వగైరా క్షిపణులు తయారు చేసి పాక్‌పై ఎక్కుపెడుతుంటే, పాకిస్థాన్ ఘోరీ క్షిపణులను భారత్‌పై ఎక్కుపెడుతోంది.

అణు సామ్రాజ్యవాదం

అణ్వస్త్రాల తయారీలో ఆధిపత్యం సాధించిన అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అణు ఇంధనాన్ని, అణు పరిజ్ఞానాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని ఇతర దేశాలు అణు పరిజ్ఞానం సంపాదించకుండా అడ్డుకుంటున్నాయి. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి), సమగ్ర అణు పరీక్షల నియంత్రణ (సిటిబిటి) వంటి ఒప్పందాల్లో సభ్య దేశాలను ఇరికిస్తాయి. ఈ ఒప్పందాలకు అంగీకరించిన దేశాలపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ద్వారా తనిఖీలు జరిపిస్తాయి. అంగీకరించకపోతే తీవ్రమైన ఆంక్షలు విధిస్తాయి. అమెరికాకు అనుకూల దేశాలపై ఆంక్షలు ఉండవు సరికదా అన్ని రకాల సహకారం వాటికి అందుతుంది. ఉదాహరణకు ఇజ్రాయిల్. కానీ వాటి మాట వినకపోతే ఆంక్షల పేరుతో దేశాలనే సర్వ నాశనం చేయడానికి ప్రయత్నిస్తాయి. ఉదాహరణకు ఇరాక్. ఇరాక్ దగ్గర అణ్వాయుధాలున్నాయన్న పేరుతో అమెరికా ఆ దేశంపై దండెత్తింది. కానీ ఇరాక్ నాశనమైన తరువాత, అక్కడి వనరులు తమ చేతికి చిక్కిన తరువాత అక్కడ ఎటువంటి అణ్వాయుధాలు లేవని తేల్చింది. ఇరాన్, ఉత్తర కొరియా తదితర దేశాల మీద కూడా అమెరికా అణ్వాయుధ వ్యాప్తి నిరోధం పేరుతో క్రూరమైన ఆంక్షలు విధిస్తోంది.

పోఖ్రాన్, ఇండియా

చెర్నోబిల్‌లో అణుబాంబు విధ్వంసం


నాగసాకిపై వేసిన 'ఫ్యాట్ మాన్'

భారత దేశం-అమెరికా-అణు ఒప్పందం

ఈ నేపథ్యంలోనే 2005లో అమెరికా భారత్‌తో అణు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం పైకి చూసినప్పుడు భారత్‌కు మేలు చేసేవిధంగా కనిపిస్తుంది. ఎందుకంటే అణ్వస్త్ర నిరోధక ఒప్పందంపై సంతకం చేయనందుకు భారత్‌పై విధించిన పలు ఆంక్షలను ఈ ఒప్పందం కింద ఎత్తివేయడం జరుగుతుంది. ముఖ్యంగా అంతర్జాతీయ విపణిలో అణు ఇంధనాన్ని కొనుగోలు చేయడానికి మనకు వీలు కలుగుతుంది. ఇతర దేశాల నుండి ముఖ్యంగా అమెరికా నుండి అణు ఇంధనంతోబాటు, అణు రియాక్టర్లు దిగుమతి చేసుకోడానికి అవకాశమేర్పడుతుంది. దీని వల్ల మన దేశంలో అణువిద్యుదుత్పత్తికి అవకాశాలు పెరుగుతాయని అటు అమెరికా ఇటు ఒప్పందం చేసుకున్న మన ప్రభుత్వం చెబుతున్నాయి. కానీ వాస్తవంగా ఈ అణు ఒప్పందం వల్ల మన దేశం దీర్ఘకాలంలో తీవ్రంగా నష్టపోతుందని నిపుణులు చెబుతున్నారు.

మొదటిది, అమెరికా ఇప్పుడు మనకు అణు ఇంధనం, రియాక్టర్లు సరఫరా చేయడం మనపై ప్రేమతో కాదు. దానికి ఆ అవసరం వచ్చింది. అమెరికా, సోవియట్‌ల మధ్య ఒప్పందాలతో ఆ దేశం వేల కొద్దీ అణు బాంబులను నిర్వీర్యం చేయాల్సి వచ్చింది. అయితే వాటిలోని అణు పదార్థం పారేయడానికి కుదరదు. అణు పదార్థం ఎక్కడ ఉంచినా వాతావరణం అణుధూళితో కలుషితమైపోతుంది. నీరు, నేల, మొక్కలు, జంతువులు, చివరికి మనుషులు అణుధూళి బారిన పడితే క్యాన్సర్ వంటి రోగాలతో మరణిస్తారు. దాన్ని ఎక్కడ పెట్టినా కొన్ని లక్షల సంవత్సరాలు నాశనం కాకుండా ఉంటుంది. అందువల్ల అణు పదార్థాన్ని విద్యుదుత్పత్తికి ఉపయోగించాలి. లేకుంటే చాలా వ్యయం, రిస్కులు తీసుకుని లక్షల సంవత్సరాలు భూమి అడుగున కాంక్రీటు దిమ్మెలలో దాచిపెట్టాలి. కానీ అమెరికాలో జరిగిన అణు ప్రమాదాలు ముఖ్యంగా త్రీమైల్ ఐలాండ్ దుర్ఘటన, రష్యాలోని చెర్నోబిల్ దుర్ఘటనల తరువాత తమ దేశంలో అణు విద్యుత్ రియాక్టర్లు పెట్టడానికి అమెరికన్లు అంగీకరించడం లేదు. పోనీ అంత ఖర్చు చేసి ఇంధనం దాయడం రిస్కుతో కూడిన పని కాబట్టి భారత్ వంటి దేశాలకు రియాక్టర్లను, ఇంధనాన్ని ఎగుమతి చేస్తున్నారు. మిగతా ఇంధనాలతో పోలిస్తే ముఖ్యంగా బొగ్గు, గ్యాస్‌తో పోలిస్తే అణు ఇంధనం చాలా ఖరీదైంది. అలాంటప్పుడు మన దేశం ఇరాన్, మయన్మార్ వంటి దేశాల నుండి గ్యాస్ దిగుమతి చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేస్తేనే మనకు లాభదాయకం. కానీ అమెరికాతో మన దేశం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇరాన్ నుండి మనం గ్యాస్ దిగుమతి చేసుకోకూడదు. ఎందుకంటే అమెరికా దానిపై ఆంక్షలు విధించింది కనుక (ఇటీవల ఇరాన్‌తో కుదిరిన ఒప్పందం మేరకు ఆంక్షలు కొంతవరకు సడలించారనుకోండి). అందువల్ల అమెరికాకు పనికిరాని ఇంధనాన్ని, రియాక్టర్లను మన దేశానికి పంపడం, దానికి అమెరికానే రుణాలు ఇవ్వడం ఎవరి ప్రయోజనాల కోసం.

కచ్చితంగా భారత్ ప్రయోజనాల కోసం మాత్ర కాదు. పైగా ఈ ఒప్పందం ప్రకారం అమెరికా గనుక నాసిరకం రియాక్టర్లు భారత్‌లో నెలకొల్పడం వల్ల ఇక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే నష్ట పరిహారం అమెరికా రియాక్టరు కంపెనీలు ఇవ్వవట, భారత ప్రభుత్వమే ఆ భారాన్ని భరించాలట. ఇటువంటి క్రూరమైన ఒప్పందాన్ని మన మెడలు వంచి చేయించింది అమెరికా.

రెండవ విషయం, అమెరికాతో అణు ఒప్పందం వల్ల మన దేశంలో విస్తారంగా లభ్యమయ్యే థోరియం ఇంధనం నుండి ప్లూటోనియం తయారుచేసి దాన్ని ఇంధనంగా వాడుకునే పరిశోధనలు మూలపడ్డాయి. మొత్తం మీద చూసినప్పుడు భారత దేశాన్ని తన గుప్పెట్లో పెట్టుకోడానికి అణు ఒప్పందాన్ని పాచికగా ఉపయోగించింది అమెరికా.డెబ్బయ్యేళ్ల క్రితం ఒక వినాశనకర పాత్రతో ప్రారంభమైన అణు శక్తి నేటికీ ఇంచుమించు అదే పాత్రలో కొనసాగుతోంది. తప్పు అణు శక్తిది కాదు. అణు తంత్రాన్ని ఆధిపత్య సాధనంగా వాడుకుంటున్న నేటి ప్రపంచ వ్యవస్థది తప్పు. నిజానికి ప్రపంచంలో అన్ని దేశాలూ అణ్వాయుధాలను విడనాడి అణశక్తిని శాంతియుత ప్రయోజనాలకు మాత్రమే వినియోగిస్తే అణుశక్తి వల్ల మానవాళికి ఎనలేని మేలు కలుగుతుంది.

హఠాత్తుగా బ్రేక్ పడడంతో వాహనాలన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి. కొన్ని ఒకదానికొకటి గుద్దుకున్నాయి. దాంతో రభస మొదలైంది. మరో వైపు అందరూ'ఏమైంది..ఎందుకిలా ఆగిపోయాయి ? వీఐపి ఎవరైనా వస్తున్నాడా మన ప్రాణాల మీదికి? ప్రమాదం జరిగిందా? జనాలకి అస్సలు ట్రాఫిక్ సెన్స్ లేకుండా పోయింది. అందరికీ తొందరే ! ఇక మనం కదిలేది ఎప్పుడో! అంటూ రకరకాల వ్యాఖ్యానాలు మొదలయాయి. గడియారాలవైపు చూసి విసుక్కోవడం మొదలెట్టారు. ఇంతలో ఎవరో చిన్న పిల్లని ఎవరిదో కారు గుద్దేసిందనీ , ఆ పిల్ల ఎగిరి రోడ్డు పక్కన పడిందనీ, తల పగిలిందనీ ఆ పిల్ల తల్లి పిచ్చిదనీ ముందు వాహనాల్లో ఉన్న వాళ్ళు అనగానే ఆ వార్త అందరికీ చేరింది.

' ఓగాడ్ ! ఆ దిక్కుమాలిన పిల్ల ఇప్పుడే అడ్డంగా రావాలా? నాకు అర్జెంట్ మీటింగ్ ఉంది. ఆలస్యంగా వెళ్తే బాసు క్లాస్ తీసుకుంటాడు! పిల్లలకి జంతువులకి తేడా లేకుండా పోయింది. ఎక్కడపడితే అక్కడ రోడ్డుకి అడ్డంగా కనిపిస్తారు. రోడ్డు మీదే ఆటలు, పరిగెత్తడం, లేకపోతే బిచ్చం ఎత్తడం. ఈ ట్రాఫిక్ పోలీసులు ఏం చేస్తున్నారో? ఆ పిచ్చిదాన్ని పట్టుకుని ఎందుకు తీసుకుపోరు? ఇక్కడ ఇష్టారాజ్యం ..ఎవరైనా, ఎప్పుడైనా ,ఎక్కడైనా వాహనాలకి అడ్డంగా ధర్నాలు చెయ్యొచ్చు, ర్యాలీలు మొదలెట్టొచ్చు..అసలు చట్టం ఏం చేస్తున్నట్టు ? యూజ్లెస్ పీపుల్ ....! అంటూ ఆఫీసర్ లాగ ఉన్న ఒకాయన తెగ విసుక్కుంటూ అందరి దృష్టినీ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

'ఆ పిచ్చిది అడ్డం లేవడం లేదు. పోలీసులకి ఫోన్ చేశారా ఎవరైనా?

పోలీసులు రాలేదు గాని టీవీ వాళ్ళు కెమెరాలతో సహా రంగంలోకి దిగిపోయారు. ఈ మీడియా వాళ్లకి అన్నీ వార్తలే ! ఇక వాళ్ళు ఇదంతా కెమెరాల్లోకి ఎక్కించేదాకా కదలరు. మనం ఇవాళ ఆఫీసుకి వెళ్ళినట్టే'! అన్నాడు ఆ ఆఫీసరు.

కొందరు వాహనాలు దిగి పిచ్చిది కూర్చున్న చోటికి వెళ్ళారు. తమాషా చూసేందుకు పనీ పాటూ లేనివాళ్ళందరూ గుమిగూడారు. అందరికీ టీవీలో కనిపించాలన్న ఆత్రుతే. నేను అందర్నీ తోసుకుంటూ, ముందుకు చేరుకున్నాను. కానీ అక్కడి దృశ్యం చూడగానే మొహం తిప్పుకోవలసివచ్చింది. ఒక నడివయసు స్త్రీ శరీరం పై భాగం మీద ఎటువంటి ఆచ్ఛాదనా లేకుండా కేవలం పెట్టీకోట్ తొడుక్కుని కూర్చుని ఉంది. ఆమె జుట్టు పొట్టిగా,మగాళ్ళ క్రాపులా ఉంది. సగం వెంట్రుకలు నెరిసిపోయాయి. రొమ్ములు పాలతో నిండి బరువుగా ఉన్నాయి. ఒంటికి ఎటువంటి పోషణా లేనట్టు వడిలిపోయి ఉంది. అసలు తను అలా అర్ధనగ్నంగా అంతమంది ఎదుట ఉన్న స్పృహే ఉన్నట్టు లేదామెకి. కళ్ళు విప్పార్చి అక్కడున్న వాళ్ళని తేరిపార చూస్తోంది. కొందరు ఆమె నగ్న దేహాన్ని అల్లరిగానూ కొందరు సానుభూతితోనూ చూస్తున్నారు.

'వయసులో ఉన్నప్పుడు అందంగానే ఉండి ఉండాలి...' అన్నారెవరో వెనక నుంచి

'వాలకం చూస్తే మంచి కుటుంబానికి చెందినదానిలాగే ఉంది కదూ? అన్నారు ఇంకొకరు.

'ఆలా అయితే ఇక్కడెందుకుంటుంది? ఎవరో మోసం చేసినట్టున్నారు పాపం...'ం ఇలా ఆమె గురించి రకరకాల వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి. కానీ ఆమెకి ఆ మాటలేవీ వినిపిస్తున్నట్టు లేదు. కెమెరాలు, మైకులు , మీడియా సిబ్బంది వేటినీ పట్టించుకోవడం లేదామె. కానీ తన పిల్ల దరిదాపులకి ఎవరైనా వస్తే మాత్రం ఆడపులిలా వాళ్ళ మీదికి ఉరుకుతోంది.

"చూశారా, పిల్లని తాకితే ఎలా మీద పడిపోతోందో"

"ఎవరికి కన్నదో

నేరం ఎవరిది?

మూలం: **ఊర్మిళా శిరీష్**

అనువాదం: **ఆర్. శాంతసుందరి**

◆ కథ

ఈ పాపాన్ని"

"ఎవడో పోరంబోకు అయుంటాడు..వెధవ"!

"తల్లి ప్రేమంటే అదే మరి.... పిచ్చిదానికి కూడా పిల్లకి ఏం హాని జరుగుతుందోనన్న భయమే"

ఇంతలో ఎవరో అందర్నీ అదిలించారు," ఏమిటి తమాషా చూస్తున్నారు? మీకు ఇదంతా సరదాగా ఉన్నట్టుంది. అవతల బోలెడు పనులు చేసుకోవాలి. ఆమెని అక్కణ్ణుంచి పక్కకి లాగండి".

మరుక్షణం గట్టిగా కెవ్వుమని అరిచింది ఆ పిచ్చిది. ఒక్కసారిగా భయపడి అందరూ వెనక్కి తగ్గారు. కానీ ఒక వ్యక్తి మాత్రం ఆమె దగ్గరకి పరిగెత్తే సాహసం చేశాడు. వెంటనే ఆమె అతన్ని కొట్టడానికి వచ్చింది.

"పోలీసులకి ఫోన్ చేశాం.." అన్నారెవరో. కానీ పోలీసులు వచ్చేందుకు ఎంత టైమ్ పడుతుందో, అసలు వస్తారో రారో, అనుకుంటూ కొందరు వెనక్కి వెళ్ళి పోసాగారు. కొందరు వాహనాలని వెనక్కి తిప్పి మరో దారిన బైట పడేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఒక గంట గడిచాక పోలీసులు వచ్చారు. వాళ్ళ వెంట ఒక ఆడ పోలీసు కూడా వచ్చింది. పోలీసులు లాఠీలు తిప్పుతూ, విజిల్స్ వేస్తూ జనాన్ని ఒక పక్కకి తప్పించి వాహనాలు వెళ్ళేందుకు దారి చేస్తున్నారు. ఆడ పోలీసు ఆ పిచ్చిదాన్ని సమీపించే సరికి ఆమె మళ్ళీ గట్టిగా కేకలు పెట్టడం మొదలెట్టింది. ఆకాశం దద్దరిల్లేట్టు అరుస్తూ వాళ్ళకి చిక్కకుండా పరిగెత్తసాగింది. ఆ సమయంలో ఆమెకి అంత బలం ఎక్కడినించి వచ్చిందో తెలీదు!

" ఆ పిల్లని ముట్టుకోవద్దు... ముందు ఆమెని కంట్రోల్ చెయ్యండి..." అని ఎవరో అరిచారు. పిల్ల తల ఒక్క పక్క బాగా గాయపడి పగిలిపోయింది. మొహం నీలంగా మారింది. మట్టి కొట్టుకున్న ఆ చిన్ని ఒంటిమీద కారిన రక్తం గడ్డకట్టి ఎండిపోయింది.ఆ పిచ్చిదాన్ని పట్టుకునేందుకు పోలీసులు నానా అవస్థా పడుతూండగా ఒక వ్యక్తి అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చి " ఆగండి కాస్త ఉండండి..." అని అరిచాడు. అతను ఆ చిన్న పిల్ల దగ్గరకి వెళ్ళాడు. పిచ్చిది అతన్ని ఏమీ అనకపోవడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అతను పిల్లని పట్టుకుని తడిమాడు, అటూ ఇటూ తిప్పి గాయాలని చూశాడు. తరువాత జనం వైపు తిరిగి," ఎవరు? ఈ పిల్ల మీదికి వాహనం నడిపిందెవరు? దిక్కు మొక్కూ లేని వాళ్ళనుకుని ఇలాంటి పని చేస్తారా? పసిపిల్ల అని కూడా చూడకుండా ఒళ్ళు కొవ్వెక్కి కార్లు నడుపుతారా?" అంటూ కోపంతో రెచ్చిపోసాగాడు. పోలీసులు అతన్ని అదుపు చెయ్యబోయారు. అతను వాళ్ళని పట్టించుకోకుండా పిల్లని కింద పడుకోబెట్టి తన భుజం మీదున్న పెద్ద తువ్వాల పరిచి ప్రాణం లేని ఆ పిల్ల శరీరాన్ని అందులో చుట్టి ఆ పిచ్చిదాని దగ్గరకెళ్ళి, "ఏం కాలేదు, బాగైపోతుంది....లే, లేచిరా.." అన్నాడు. పోలీసులతో "నేను చెపితే వింటుంది సార్. నా వెంట తీసుకుపోతాను. మీరు మధ్యలో ఏమీ అనకండి"...

అంటూండగానే టీవీ వాళ్ళు కెమెరా, మైకు పట్టుకుని అతని ముందుకి వచ్చి ప్రశ్నించడం మొదలెట్టారు.

" మీరెవరు? ఈమె మీకెలా తెలుసు? మీరు పిల్ల దగ్గరికెళ్తే ఆమె ఎలా ఊరుకుంది?"

ఆ ప్రశ్నలకి అంతు కనిపించలేదు. అతను అయాసపడిపోతున్నాడు. పిచ్చిది ప్రస్తుతం నెమ్మదిగా ఉంది, కానీ మళ్ళీ రెచ్చిపోదన్న నమ్మకం అతనికి లేదు. పిల్లనీ , ఆమెనీ అక్కణ్ణుంచి ఎంత త్వరగా తీసుకెళ్దామా అని చూస్తున్నాడతను.

"ముందు రోడ్డుమీంచి అవతలికి వెళ్ళండి, ఆ తరువాత మాట్లాడుదురు గాని..ఊ కదలండి క్విక్... " అంటూ ఒక పక్క పోలీసులు మీడియావాళ్ళని గదమాయిస్తున్నారు. అదే అదనుగా అతను పిల్లని భుజాన వేసుకుని అక్కణ్ణుంచి కదిలాడు. పిచ్చిది అక్కడున్న వాళ్లని కాల్చేసేట్టు కోపంగా చూస్తూ అతన్ని అనుసరించింది. ఆమె కళ్లలో కోపం తప్ప ఒక చుక్క కూడా కన్నీళ్ళు లేవు.

" ఈ పిల్ల తండ్రి వీడేనేమో"? అన్నారెవరో వెకిలిగా నవ్వుతూ.

"చూసేందుకు ఎంత అమాయకుడిలా ఉన్నాడో! అయినా కలియుగం, పిచ్చిదాన్ని కూడా వదలరు కక్కుర్తిగాళ్ళు" అంటూ ఇంకా బూతుమాటలేవో వినిపించాయి. కొంత మంది ఆ చెత్త హాస్యానికి పగలబడి నవ్వారు. మీడియా వాళ్ళు అతన్ని వదలకుండా వెంటపడ్డారు. తప్పించుకునే దారిలేక అతను ఆగి వాళ్ళ ప్రశ్నలకి సమాధానాలు చెప్పసాగాడు. "సార్, నేను ఒక టీ దుకాణం నడుపుతున్నాను. ఆ పక్కనే కొంత ఖాళీ స్థలం ఉంది. ఏడాదిన్నర క్రితం ఈమెని మొదటిసారి అక్కడే చూశాను. ఒంటరిగా కూర్చుని తనలో తాను ఏదో గొణుక్కుంటూ ఉండేది. పాటలు పాడేది. అకారణంగా నవ్వేది, ఏవేవో పేర్లు పిలిచి మాట్లాడేది, కానీ అక్కడ ఎవరు ఉండేవారు కాదు. ఈమె కడుపు ఎత్తుగా పెరగడం చూసి కొందరు తినేందుకు ఏమైనా ఇచ్చేవారు. నెలలు నిండాక నా భార్యా నేను కలిసి ఈమె ప్రసవానికి సాయం చేశాం. ఆ తరువాత ఆ పిల్ల తోడిదే లోకంగా బతకసాగింది. కానీ ఆ పసిదానికి స్నానం చేయించాలనీ, పాలు పట్టాలనీ ఆమెకి ధ్యాస ఉండేదే కాదు. ఆ పనులన్నీ నా భార్య చేసేది. చేతికిచ్చి పాలు పట్టమని చెపితేనే ఈమె పట్టేది. ఎక్కడికైనా వెళ్ళినా పాప కోసం త్వరగా వచ్చేసేది"

"ఆమె ఎవరు? ఎక్కణ్ణించి వచ్చింది? మానసికంగా ఇలాంటి స్థితికి చేరుకోవడానికి కారణం ఏమని చెప్పింది"? టీవీ వాళ్ళు అతన్ని అడిగారు.

" అంతకన్నా ఆమె విషయం నాకేమీ తెలీదు. మాకు తన గురించి ఆమె ఏమీ చెప్పలేదు. అప్పుడప్పుడూ ఎవరూ ఏమీ అనకపోయినా గట్టిగా కేకలు పెట్టేది, హఠాత్తుగా భయంతో పరిగెత్తేది. ఒక్కోసారి చేతులు జోడించి దీనంగా ఎవరినో బతిమాలుతున్నట్టు "వదలండి ...కొట్టకండి..దయచేసి వదిలిపెట్టండి...చంపొద్దు మీ కాళ్ళకి దండం పెడతా" అంటూ ఏడ్చేది. ఎందుకిలా చేసేదో మాకు అర్థమయ్యేది కాదు.." అని ఆగి చేతుల్లో ఉన్న పిల్ల వైపు చూసి" ఇక ఈ పిల్ల లేకుండా ఎలా బతుకుతుందో! పాపం, ఇంకా తన పాప బతికే ఉందని అనుకుంటోంది. పాపని పూడ్చిపెట్టే పని నేనే చెయ్యాలి. అప్పుడు ఆమె ఎలా తట్టుకుంటుందో ఏమో'! అన్నాడు ఆ వ్యక్తి.

మీడియాకి పాత్రికేయులకి ఇది ఒక తాజా వార్త. అక్కడ చేరిన జనానికి ఒక వింత. ఒకేరకంగా సాగిపోయే జీవితంలో ఒక సంచలనాత్మకమైన సంఘటన. మర్నాడు వార్తా పత్రికల్లోనూ, టీవీలోనూ ఈ సంఘటన గురించి చూసేవారు 'అయ్యో పాపం'! అంటూ ఒక్క నిమిషం సానుభూతి కనబరచి మళ్ళీ వాళ్ళ పనుల్లో మునిగిపోతారు. కానీ ఆ తరువాత ఏం జరుగుతుంది? ఆ పిచ్చి దానికి నిజం తెలిశాక ఆ యువకుడు ఆమె దు:ఖానికి, కోపానికి ఎలా తట్టుకుంటాడు? ఇక అవన్నీ ఎవరికీ పట్టలేదు. ఈ విషాదం కూడా అన్నిటిలాగే కాలగర్భంలో త్వరగానే కలిసిపోతుంది.

కానీ నేను మర్చిపోలేకపోయాను. ఆమె మాటిమాటికీ గుర్తొస్తోంది. ఆమె కళ్ళూ తైల సంస్కారానికి నోచుకోని జుట్టూ, అర్ధనగ్నంగా రోడ్డు మధ్యలో కూర్చున్న ఆమె రూపం, ప్రాణాంతకమైన గాయాలు తగిలిన ఆ పసిపిల్లా...అంతా స్పష్టంగా నా కళ్ళ ముందు తిరుగుతూనే ఉంది.

మళ్ళీ ఒకరోజు ఆ దారంట వెళ్తూ టీ కొట్టు రమేశ్ ఉన్నాడేమోనని అటువైపు చూశాను. యంత్రంలా పనిచేస్తూ అతను దుకాణానికి వచ్చిన వాళ్ళకి టీ అందిస్తున్నాడు. నేనతని దగ్గరికి వెళ్ళి " ఆ పిచ్చి మనిషి ఇక్కడ లేదా? ఎటెళ్ళింది?" అని అడిగాను.

రమేశ్ నా వైపు అనుమానంగా చూశాడు. మళ్ళీ పత్రికల వాళ్ళెవరో నన్ను పంపారా లేక ఊసుపోక ఆ సంఘటనని మళ్ళీ తవ్వేందుకు వచ్చానా అనుకున్నట్టున్నాడు".

'ఎందుకు అడుగుతున్నారు? ఆ పిచ్చి మనిషి

గురించి మీకెందుకంత ఆసక్తి?

తెలుసుకుని ఏం చేస్తారు? అన్నాడు కాస్త కోపంగా.

" ఆసక్తి ఎందుకుండకూడదు? " అన్నాను ఆత్మీయంగా.

"పిల్లని అంత భయంకరంగా గాయపరిచి పారిపోయిన ఆ వాహనదారుణ్ణి ఇంతవరకూ పట్టుకోనే లేదు.... అతనెవరో తెలుసుకునేందుకు కూడా ప్రయత్నించలేదు. ఆ పిల్ల ఒక పిచ్చిదాని బిడ్డ అనే కదా? ఇదే ఏ మంత్రి కూతురో, గొప్ప ఆఫీసర్ కూతురో, డబ్బున్న వాడి పిల్లో అయితే ఊరుకుంటారా పోలీసులు". రమేశ్ కోపం పెరిగిపోసాగింది. శాంతంగా మాట్లాడి అతని కోపం పోగొట్టి, నేను జరిగినదానికి ఎంత బాధపడుతున్నానో చెప్పాక అతను కాస్త తగ్గి చెప్పడం మొదలుపెట్టాడు.

"నేను పిల్లని పాతిపెట్టేందుకు తీసుకెళ్తుంటే ఆ పిల్ల తల్లి నా వెనకాలే వచ్చింది. పిల్లని ఎక్కడ పాతిపెడుతున్నానో ఆమెకి తెలియడం నాకిష్టం లేకపోయింది. మతి స్థిమితం లేని ఆమె శవాన్ని తవ్వి బైటికి తీస్తుందేమోనని భయపడ్డాను. కానీ పిల్ల శవం ఆసరికే వాసన వేయసాగింది. ఈగలు ముసురుతున్నాయి. ఎలాగో ఆమె కళ్ళు కప్పి శవాన్ని పూడ్చి వచ్చాను. నన్ను చూడగానే నా మీదికి వస్తువులు విసురుతూ అరవడం మొదలెట్టింది. మధ్య మధ్యలో నేల మీద పొర్లిగింతలు పెడుతూ ఏడ్చేది. ఇలా రెండు రోజులు నానా హంగామా చేశాక ఆవేశం కాస్త చల్లారింది. కానీ తిండి తినడం పూర్తిగా మానేసింది. హఠాత్తుగా ఒకరోజు మాయమైంది. ఎక్కడికెళ్ళిందో తెలీదు. చుట్టుపక్కల వెతికి వచ్చాను. ఎక్కడా కనబడలేదు.

" ఎలా వెళ్ళిందో అలాగే హఠాత్తుగా ప్రత్యక్షమైంది. ఆమె చేతుల్లో రెండు వీధి కుక్కపిల్లలు కనిపించాయి. రోజంతా వాటిని ముద్దు చేస్తూ, వాటితో ఆడుకుంటూ కొన్నాళ్ళు తన దుఃఖాన్ని మర్చిపోయినట్టు కనిపించింది.కానీ మధ్య మధ్య తన పాప కోసం ఏడుస్తూ అటు ఇటూ వెళ్ళి వెతికేది. ఆమె బాధ చూడలేకపోయేవాణ్ణి. చివరికి ఒకరోజు తెల్లవారుతూ ఉండగా తను ఎప్పుడూ కూర్చునే చెట్టుకింద ఆమె నిర్జీవంగా పడి ఉండడం చూశాను. చివరిదాకా నా మీద ఆమెకి కోపం తగ్గలేదు. తన పిల్ల చనిపోవడానికి కారణం గుడ్డిగా వాహనం నడిపిన వ్యక్తి, కానీ ఆమె దృష్టిలో నేనే అపరాధిని... ఎందుకంటే చివరిసారిగా ఆ పిల్లని నా చేతుల్లోనే చూసిందామె. నేనే తన పిల్లని ఎక్కడో మాయం చేశానని నా మీద కోపం పెట్టుకుంది". అని బాధపడుతూ చెప్పడం ముగించాడు రమేశ్.

కొంతసేపు ఇద్దరం మౌనంగా ఉండిపోయాం . మా చుట్టూ నిశ్శబ్దం పరుచుకుంది. అతను చెప్పిన విషయాలు విని ప్రకృతి కూడా మూగబోయిందా అనిపించేంత నిశ్శబ్దం! ఉన్నట్టుండి రమేశ్ చెట్టుకిందకి వెళ్ళి దుమ్ముకొట్టుకున్న కొన్ని కాయితాలు నా దగ్గరికి పట్టుకొచ్చాడు.

"మేడమ్....మేడమ్... ఇలా చూడండి. ఇవన్నీ ఆమె వస్తువులు. ఈ కాయితాలని ఆమె ఎప్పుడూ తిరగేసి చూస్తూ కంటతడి పెట్టేది. ఒక్కోసారి కనపడని ఎవరిమీదో కేకలు పెట్టేది. వీటిలో ఏముందో మీరు కాస్త చూస్తారా"? అని వాటిని నా చేతికిచ్చాడు. పాత వార్తపత్రికలోని కాయితాలవి. మడిచి ఉండడం వల్ల ఆ మడతల్లో చిరుగులు పట్టాయి. కాయితం పసుపు రంగులో ఉంది. దుమ్ము కొట్టుకుపోవడం వల్ల ఆ అక్షరాలు స్పష్టంగా కనిపించడం లేదు. కానీ అందులో కొన్ని ఫోటోలు ఉన్నాయి. వాటికింద ఏదో రాసుంది. నేను కారు దిగి కాయితాలని బోనెట్ మీద సాఫీ చేసి చదివేందుకు ప్రయత్నించాను. చదవడం చాలా కష్టమైంది కానీ కళ్ళు నొప్పెట్టేట్టు అక్షరాల మీద దృష్టి కేంద్రీకరిస్తే కొన్ని పదాలు కనిపించాయి. 'ఒకే కుటుంబానికి చెందిన ఐదుగుర్ని తుపాకీలతో కాల్చి చంపారు....ఒక స్త్రీ మాత్రం తప్పించుకుంది. గర్భవతి ...బైటికెళ్ళి ఉండడం వల్ల ...."ఆ మసకబారిన ఫోటోలో ఆరుగురు కనిపిస్తున్నారు. ఇద్దరు మగవాళ్ళు, ఇద్దరు ఆడవాళ్ళు, ఇద్దరు ఆడపిల్లలు ....అక్షరాలు అక్కడక్కడా అలుక్కుపోయినట్టు ఉండడం వల్ల వాళ్ళని ఎవరు చంపారో ఎందుకు చంపారో తెలీదు నాకు.

కళ్ళు నులుముకుని మళ్ళీ తదేకంగా ఆ ఫోటోని చూశాను. అందులో ఉన్న అందరి మొహాలూ నాకు ఆ పిచ్చిదాని మొహంలాగే కనిపించసాగాయి! ✦

క్యాప్సికం చట్నీ

కావలసిన పదార్థాలు

క్యాప్సికం–అర కిలో, ఎండు మిరపకాయలు–8, సెనగపప్పు–8 చెంచాలు, మినప్పప్పు–6 చెంచాలు, ఆవాలు–4 చెంచాలు, మెంతులు–ఒకటిన్నర చెంచా, కరివేపాకు–ఒక రెబ్బ, నూనె–8 చెంచాలు, పసుపు–అర చెంచా, చింతపండు–కుంకుడు కాయంత, ఉప్పు–తగినంత, ఇంగువ–అర చెంచా, పోపుని రెండు భాగాలు చేసుకోవాలి. ఒక భాగాన్ని పొడి చేసి పెట్టుకోవాలి. ఇంకో భాగాన్ని అలంకరణకి ఉపయోగించాలి.

తయారీ

ఒక బాణలిలో 4 చెంచాల నూనె పోసి వేగాక ఒక చెంచా ఆవాలు, 4 చెంచాల సెనగపప్పు,3 చెంచాల మినప్పప్పు,2 ఎండు మిరపకాయలు వేసి ఎర్రగా వేయించాలి. చివర్లో కరివేపాకు, ఇంగువ వేసి వేరే పాత్రలోకి మార్చుకోవాలి. బాణలిలో నూనె వేయకుండా మిగిలిన ఆవాలు, సెనగపప్పు, మెంతులు, ఎండు మిర్చి వేసి ఎర్రగా వేయించాలి. చల్లారిన తర్వాత తాలింపు పొడి ఇంకో భాగం, క్యాప్సికం ముక్కలు నానబెట్టిన చింతపండు మిక్సీలో వేసి చట్నీ చేయాలి. మొదట తయారు చేసిన తాలింపు కలిపితే రుచికరమైన క్యాప్సికం చట్నీ రెడీ.

పైనాపిల్ పచ్చడి

కావలసిన పదార్థాలు

పండిన పైనాపిల్–1, బెల్లం–అర కిలో, కరివేపాకు–ఒక రెబ్బ, ఎండు మిరపకాయలు–5, కొబ్బరికాయ–1, ఆవాలు–అరచెంచా, పసుపు–అర చెంచా, జీలకర్ర–1 చెంచా, ఉప్పు–తగినంత

తయారీ

పైనాపిల్ చెక్కు తీసి చక్రాలుగా తురుముకోవాలి. ఓ పాత్రలో కొంచెం నీరు పోసి అందులో ముక్కలను వేసి సన్నని మంట మీద ఉడికించాలి. అందులో పసుపు,కారం, ఉప్పు వేయండి. బెల్లం సన్నగా తురమండి. కొబ్బరి కోరులో జీలకర్ర, ఆవాలు కలిపి మెత్తని ముద్దగా నూరండి. ఎండు మిరపకాయలు విడిగా నూరి ముద్ద చేసుకోండి. ఉడుకుతున్న పైనాపిల్ ముక్కలు మెత్తబడగానే బెల్లం వేసి గంటెతో కలుపుతూ ఉండండి. ద్రావణం చిక్కబడతుండగా కొబ్బరి ముక్క ఎండు మిర్చి ముద్ద, కరివేపాకు వేసి బాగా కలిపి దించండి.సిద్ధమైన పైనాపిల్ పచ్చడిని బ్రెడ్ టోస్టులతో కలిపి వడ్డించండి.

బీట్ రూట్ చట్నీ

కావలసిన పదార్థాలు

బీట్ రూట్ –అర కిలో, చింతపండు–కొద్దిగా, పసుపు–చిటికెడు, ఎండు మిరపకాయలు–10, ఆవాలు–చెంచా, మెంతులు–కొద్దిగా, ఇంగువ–కొద్దిగా, మినవ్పప్పు–చెంచా, ఉప్పు–తగినంత, కరివేపాకు–ఒక రెమ్మ, నూనె–50 గ్రాములు

తయారీ

ముందుగా బాణలిలో రెండు టీ స్పూన్ల నూనె వేసి వెచ్చబడ్డాక ఆవాలు, మెంతులు, ఎండు మిరపకాయలు, ఇంగువతో తాలింపు వేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు సన్నగా తురిమి పెట్టుకున్న బీట్ రూట్ని పచ్చి వాసన పోయేదాక నూనెలో వేయించాలి. ఇది చల్లారిన తర్వాత మిక్సీలో వేసుకుని అందులో తగినంత ఉప్పు, చిటికెడు పసుపు, నానబెట్టిన చింతపండు గుజ్జు, ఇంతకు ముందు వేయించి ఉంచిన తాలింపు మొత్తం వేసి రుబ్బాలి. ఈ పచ్చడిని ఒక కప్పులోకి తీసుకుని దానికి కొద్దిగా మినప్పప్పు, ఆవాలు, కరివేపాకుతో తాలింపు వేసి కలుపుకోవాలి. ఈ చట్నీ వేడి వేడి అన్నంలోకి చపాతీ పూరీల్లోకి చాలా రుచిగా ఉంటుంది.

క్యాబేజీ చట్నీ

కావలసిన పదార్థాలు

క్యాబేజీ–సగభాగం, వేరుశెనగ పప్పు–పావు కప్పు, ఎండు మిరపకాయలు–3, మినప్పప్పు–1 చెంచా, సెనగపప్పు–1చెంచా, ఇంగువ–అర చెంచా, ఉప్పు–తగినంత, నూనె–కొంచెం, ఆవాలు–అర చెంచా, కరివేపాకు–కొంచెం

తయారీ

రెండు లేదా మూడు చెంచాల నూనెని వేడి చేసి వేరుశెనగపప్పు, ఎండు మిర్చి వేయాలి. తర్వాత క్యాబేజీ తురుము వేసి పొడిగా అయ్యే వరకూ వేయించాలి. వీటిని చల్లార్చి కొద్దిగా నీరు పోసి మెత్తగా రుబ్బుకోవాలి. ఇప్పుడు బాణలిలో మరో రెండు చెంచాల నూనె వేసి అందులో ఆవాలు, సెనగపప్పు, మినప్పప్పు, కరివేపాకు వేసి వేయించాలి. అది వేగాక గ్రైండ్ చేసి పెట్టుకున్న మిశ్రమానికి జోడించాలి. చివరగా ఉప్పు, ఇంగువ వేసి ఐదు నిమిషాల తర్వాత దించుకోవాలి. ఇది అన్నం, ఇడ్లీలోకి చాలా బాగుంటుంది.

చుక్కలు కలపండి



ఎక్కడున్నాయి

ఈ చిత్రంలో బోలెడన్ని వస్తువులు దాగి ఉన్నాయి. కింద ఇచ్చిన 15 బొమ్మలు ఈ చిత్రంలో ఎక్కడెక్కడ దాగున్నాయో గుర్తించండి.

ఏమేం ఉన్నాయి.

ఈ చిత్రంలో ఓ వింత జీవి ఉంది.అందులో మొత్తం రెండు ప్రాణుల శరీర భాగాలున్నాయి.వాటిని గుర్తించండి.

బంతి దారి గుర్తించండి

ఈ చిత్రంలోని ముగ్గురు చిన్నారులు తమ బంతిని కోర్టుకు చేర్చారు. అయితే వారి బంతులు ఏ దారి గుండా వెళ్లాయో గుర్తించండి.

అతికించండి

ఒక తుంటరి పిల్లవాడు మొసలి బొమ్మను కత్తిరించాడు. వాటిని తిరిగి అతికించడం మరిచిపోయాడు.
వాటిని తిరిగి అతికిస్తారు కదా?



జత చేయండి

ఈ కింది చిత్రంలోని అచ్చుల్లో సరైన దానిని జతచేయండి.



గుర్రం బొమ్మ గీద్దాం

ఆర్టిస్టు అంకుల్ ఈ వారం గుర్రం బొమ్మ ఎలా వేయాలో నేర్పుతాడంట.
మరి ఆలస్యం ఎందుకు ?



బొమ్మల పిచ్చి

స్కాట్లాండ్‌లోని అబెర్‌డీన్‌షైర్‌కు చెందిన ఇలైన్ మోరీస్ పేరు చెబితే చాలు! అక్కడి వాళ్లకు 'పోనీ టాయ్స్' టక్కున గుర్తుకు వచ్చేస్తాయి. పోనీ టాయ్స్ తెలుసుగా! ముద్దుగా ఉండే చిట్టి గుర్రం బొమ్మలు! అక్కడ పిల్లలకు ఇవంటే చాలా క్రేజ్. ఇలైన్‌కు కూడా ఈ బొమ్మలంటే ప్రాణం. ఎంత ఇష్టమంటే తన గది నిండా ఈ బొమ్మలే ఉంటాయి.

ఇదంతా చదివాక ఇలైన్ మీ వయసు అమ్మాయి అనుకుంటున్నారేమో! ఆమె చిన్న పిల్లేం కాదు. తనకు 40 ఏళ్లు వచ్చేశాయి. అయినా బొమ్మలతో ఆడుకోవడానికి చిన్నపిల్లలేం కానక్కర్లేదని అంటోంది ఇలైన్.

ఇలైన్‌కు ఐదేళ్ల వయసు నుంచే పోనీ టాయ్స్‌ను సేకరించడం అలవాటు. మొదట్లో సిండీ డాల్స్‌తో ఆడుకునేది కానీ, పోనీ టాయ్స్ ఆమెకు తెగ నచ్చేశాయి. రకరకాల రంగుల్లో వాటిని సేకరించేది.

అలా 1990 వరకు 100 బొమ్మల వరకు ఇంట్లో మారాం చేసి మరీ కొనిపించుకుంది. కానీ అవన్నీ ఒక్కసారిగా పోయాయి. ఈ లోగా పెద్దది అయిపోవడంతో వాటి సంగతి పక్కన పెట్టేసింది. కానీ, 2005లో మరోసారి పోనీ టాయ్స్‌పై దృష్టిపడింది.

ఈబే అనే ఈ-మార్కెట్‌లో మళ్లీ ఒక బొమ్మను కొంది. కొన్ని రోజుల తర్వాత మరో బొమ్మకు ఆర్డర్ ఇచ్చింది. అలా తనకు తెలీకుండా వాటిని భారీ సంఖ్యలో సేకరించడం మొదలెట్టేసింది. ఇప్పటి వరకు మన కరెన్సీలో 14 లక్షల రూపాయల వరకు విలువైన పోనీ టాయ్స్‌ను కొనిపడేసింది.

ఆమె డబ్బంతా వీటికే ఖర్చు అయిపోవడంతో బంధువులు కంగారు పడ్డారు. అప్పులు పెరిగిపోవడంతో తాను కూడా జాగ్రత్త పడటం మొదలెట్టింది. కానీ, బొమ్మలు కొనలేకుండా ఉండలేకపోయింది. నెలకు 14 వేల రూపాయల వరకు బొమ్మల్ని కొనుగోలు చేయాలని మాత్రం లెక్క పెట్టుకుంది.

ఇలా ప్రతి నెల కొనే బొమ్మలతో ఆమె గది నిండిపోతోంది. చివరకు వాటితోనే నిద్రపోవడం, వాటితో రకరకాల సెల్ఫీలు దిగుతూ ఫేస్‌బుక్‌లో పెట్టడంతో ఆమె పేరు అందరికీ చేరిపోయింది.

ఆమె లాగే పోనీ టాయ్స్‌ను ఇష్టపడేవారంతా కలిసి ఓ కమ్యూనిటీ పేజీని తెరిచారు. అక్కడ ఇలైనే సెలబ్రెటీ. ఇలైన్‌కు ఆస్పెర్‌జెర్ సింద్రోమ్ అనే మానసిక రుగ్మత ఉంది. ఆటిజం వ్యాధి లక్షణాలకు దగ్గరగా ఉంటుందిది. ఈ బొమ్మల పిచ్చి వల్ల ఆమె చాలా నష్టపోతోంది. చివరకు ఉద్యోగం కూడా లేదు.

40 ఏళ్లు వచ్చినా ఈ బొమ్మల గొడవేంటని స్నేహితులు మందలిస్తూ, పోగుబడిన ఆ **బొ**మ్మల్ని ఎవరైనా పిల్లలకు ఇచ్చేయొచ్చుగా అని అంటున్నారు. ఒక్క బొమ్మ కూడా వదిలేది లేదని మంకు పట్టు పడుతుందట ఇలైన్. ఆమెను చూసి అక్కడి వాళ్లు నవ్వుకుంటున్నారట. అలా ఫేమసైంది ఇలైన్.

పింంల్లలూ! మీరు మాత్రం ఇలా బొమ్మల పిచ్చితో పెద్దవాళ్లను ఏడిపించకండే.

✦

రూపాయి రూపాయి పోగేసి బ్యాంకులో దాచుకున్నాడు ఓ చాయ్‌వాలా. ఆ చిన్న మొత్తం తాను డ్రా చేయకుండానే ఖాళీ అవడంతో బ్యాంకును ప్రశ్నించాడు. వాళ్ల నుంచి సరైన స్పందన రాకపోవడంతో కోర్టును ఆశ్రయించి కేసు గెలిచాడు. పోగొట్టుకున్న మొత్తాన్ని దక్కించుకున్నాడు. వినియోగదారుల చైతన్యానికి ఈ టీ సప్లైయర్ రోల్ మోడల్‌గా నిలిచాడు. భారీ బ్యాంకుపై ఓ సామాన్యుని విజయంగా దీన్ని అభివర్ణించొచ్చు.



సామాన్యుని గెలుపు

టీవీల్లో, పత్రికల్లో చివరకు వీధి పోస్టర్లలో వినియోగదారుల సంఘం చేసే 'జాగో గ్రాహక్ జాగో' అనే ప్రచారం చాలా మందికి తెలిసే ఉంటుంది. వినియోగదారుడు నష్టపోతే పెద్ద సంస్థలపైనా పోరాడొచ్చని సందేశాన్ని ఇస్తుంది. అయినా, తప్పుడు ఉత్పత్తుల వల్ల మోసపోయిన వారు, కంపెనీల పొరపాట్ల వల్ల ఇబ్బందిపడేవాళ్లు, నిర్లక్ష్య వైఖరి వల్ల నష్టపోయేవాళ్లు వినియోగదారుల ఫోరమ్‌లను, కోర్టులను ఆశ్రయించడానికి వెనకాడతారు. న్యాయం జరిగే అవకాశం ఉన్నా అదో పెద్ద తలనొప్పి పని అని నష్టాన్ని భరించడానికే సిద్ధపడతారు. సామాన్యులైన తాము పెద్ద సంస్థలతో పోరాడి గెలవగలమా అని సందేహిస్తారు. కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు ఖర్చు చేసి మరింత నష్టపోతారేమోనని భయపడతారు. భోపాల్‌కు చెందిన రాజేశ్ సక్రే ఇలా ఆలోచించలేదు. టీ సప్లై చేస్తూ రూపాయి రూపాయి కూడబెట్టుకున్న తన కష్టాన్ని కోల్పోవడానికి ఆయన మనసు అంగీకరించలేదు. కోర్టును ఆశ్రయించి భారీ బ్యాంకుతో పోరాడి దాని నుంచి పరిహారం పొందాడు. లాయర్‌ను కూడా పెట్టుకునే స్థోమత లేని రాజేశ్ ఒంటరిగానే పోరాడాడు. భోపాల్‌లోని శబ్రి నగర్‌కు చెందిన రాజేశ్ సక్రే స్థానిక హమీదియా రోడ్ బ్యాంకు శాఖలో సొమ్ము పొదుపు చేస్తుండేవాడు. 2011 డిసెంబర్ 23 నాటికి ఆయన ఖాతాలో 20 వేల రూపాయలు ఉన్నాయి. అదే రోజున ఆయన అవసరార్థం 10,800 రూపాయల్ని డ్రా చేశాడు. రెండు రోజుల తర్వాత మరి కొంత సొమ్ము విత్ డ్రా చేసేందుకని వెళ్లాడు. కానీ, తన అకౌంట్ జీరో బ్యాలెన్స్ చూపించడంతో షాక్‌కు గురయ్యాడు. ఆ సొమ్ము ఏమైందో అర్థం కాలేదతడికి. బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం లేదా తప్పిదం వల్లే సొమ్ము పోయిందని గ్రహించాడు. ఇదే విషయాన్ని బ్యాంకు అధికారుల దగ్గర మొరపెట్టుకున్నాడు. అయితే తాము ఈ విషయంలో బాధ్యులు కామని వారు తప్పించుకున్నారు. ఎన్ని సార్లు అడిగినా అదే స్పందన రావడంతో ఏకంగా బ్యాంకు ముంబై హెడ్‌క్వార్టర్స్‌కే లేఖ రాశాడు. అక్కడ నుంచి ఎలాంటి జవాబు లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోలేదు. ఆ మొత్తం తమ చిన్న జీవితాలకు చాలా విలువైంది. విషయాన్ని విడవలేకపోయాడు ఎవరి ద్వారానో జిల్లా వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార న్యాయ స్థలం (డీసీడీఆర్‌ఎఫ్)ను ఆశ్రయించాడు. సక్రే ఫిర్యాదును కోర్టు తీసుకోగా, ఖాతాదారుడే సొమ్మును విత్‌డ్రా చేసుకున్నాడని బ్యాంకు తెలిపింది. దీనికి సాక్ష్యాధారాల్ని ఇవ్వాల్సిందిగా బ్యాంకునే ఆదేశించి బాధితుడి పక్షాన నిలిచింది కోర్టు. సీసీటీవీ ఫుటేజ్‌నూ అడిగింది. వీటిని ఇవ్వడంలో బ్యాంకు విఫలమైంది. 5వ తరగతి వరకే చదివిన సక్రేకు ఈ వ్యవహారమంతా ఇబ్బందిగా ఉన్నా, చాలాసార్లు కోర్టుకు హాజరవ్వాల్సి వచ్చినా వెనుకడుగు వేయలేదు. లాయర్‌ను పెట్టుకునేందుకు డబ్బులేక అతడే మేజిస్ట్రేట్ ముందు తన వాదన వినిపించేవాడు. ఆ డబ్బు తాను డ్రా చేయలేదని, తన డబ్బుపై పోరాడే హక్కు తనకు ఉందని అనేవాడు. చివరకు కోర్టు బ్యాంకుదే తప్పని ఉత్తర్వులిచ్చి సక్రే ఖాతాలోంచి పోయిన డబ్బుకు 6 శాతం వడ్డీతోపాటు, అతడి మానసిక ఆందోళన వల్ల అయిన నష్టానికి పదివేల రూపాయల్ని అదనపు న్యాయ ఖర్చులకు మరో రెండు వేల రూపాయల్ని మొత్తానికి జత చేస్తూ రెండు నెలల్లోగా ఇవ్వాలని బ్యాంకును ఆదేశించింది. ఓ సామాన్యుడు ఓ భారీ బ్యాంకుపై కేసు గెలవడంతో చాలామంది సక్రేను ప్రశంసించారు. మరికొందరు న్యాయం కోసం పోరాడేందుకు స్ఫూర్తిగా నిలిచాడు. ✦

బుజ్జి బొజ్జకు..

చిన్నారులకు గోరు ముద్దలు తినిపించాలంటే చంద్రుణ్ని మామను చేసేయాలి. పప్పేసి, చారేసి అత్తారింటికి దారేదంటూ తెలిసిన విద్యలన్నీ ప్రదర్శించాలి. బైకుల మీద షికార్లకు తిప్పాలి. కాస్ట్లీ స్మార్ట్‌ఫోన్లను భయంగానైనా సమర్పించుకోవాలి. అప్పటికి గానీ ఓ ముద్ద పూర్తికాదు. బ్రెజిల్‌లోని ఓ అమ్మ నివియా సాల్గాడో కూడా ఇలాగే నానా తంటాలు పడేది. తన కూతురు కేటారినాకు అన్నం తినిపించాలంటే జ్వరం వచ్చినంత పనయ్యేది. ఎన్ని ప్రయత్నాలు చేసినా కేటరినా ఓ ఆపిల్‌తో సరిపెట్టుకునేదే కానీ మామూలు ఆహారం ముట్టుకునేది కాదు. ఏం చేయాలా అని ఆలోచించిన ఈ డెంటిస్ట్‌కి మంచి ఆలోచన తట్టింది. కేటారినా బాగా ఆడుకునే బొమ్మల రూపంలో, రకరకాల రంగుల్లో, చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపించేలా వంటకాలు మొదలెట్టింది. ముచ్చటగొలిపే ఆకారాల్లో ఉన్న ఆ వంటకాలకు కేటారినా ఫిదా అయిపోయింది. చివరి స్పూన్ వరకు లాగించేస్తోందిపుడు. బొజ్జంతా నిండాక హాయిగా రాత్రుళ్లు నిద్రపోతోంది. సేద తీరిన తల్లి హృదయం ఈ విషయాన్ని నలుగురికీ పంచి వారి తంటాల్నీ తప్పిస్తోంది. 'మిల్ డికాస్ డి మాయి' అనే పేరిట బ్లాగ్ నడుపుతూ పిల్లల వంటకాల విషయంలో మిగతా తల్లులకు సలహాలను ఇస్తోంది. ఈ బ్లాగ్, నివియా వంటకాలు పెద్ద ఫేమస్ అయిపోయాయి. ●

'నీతి' పుస్తకాలు

చైనాలోని నాన్జింగ్‌లో హానెస్టి బుక్‌స్టోర్‌లోకి వెళితే అక్కడ స్టాఫ్ మనకు కనిపించరు. కనీసం బిల్లులు చెల్లించాలన్న ఎవరూ కనిపించరు. అయినా అక్కడ పుస్తకాలు అమ్ముడుపోతాయి. కొన్నవారు ఆ పుస్తకానికి న్యాయంగా అనిపించినంత డబ్బు కట్టేసిపోతున్నారు. ఎవరికా? ఓ డబ్బుల డబ్బాలో పుస్తకం ధరకు తగ్గ డబ్బును వేసేసి వెళుతున్నారు. ఇప్పటివరకు 800 పుస్తకాలు పట్టుకెళ్లినా ఒక్కరు కూడా డబ్బు చెల్లించకుండా వెళ్లలేదు. నిజాయితీ వాటిని కొంటున్నారు. ఆ బుక్‌స్టోర్ ఉద్దేశం కూడా అదే. సమాజంలో నీతి, నిజాయితీలను పెంపొందించడమే నిర్వాహకుల లక్ష్యం. చుట్టూ స్టాఫ్ ఉన్నపుడే కాదు ఎవరూ లేనపుడు కూడా డబ్బు చెల్లించడమనేది కేవలం వారి నిజాయితీతోనే సాధ్యం. జింజీకౌ వీధిలో ఏర్పాటు చేసిన ఈ పుస్తక విక్రయ కేంద్రంలో 1500 టైటిళ్లున్న పుస్తకాలు నాలుగు షెల్ఫ్‌ల్లో చక్కగా సర్దేశారు. గొప్ప సాహిత్య నవలలతో పాటు పిల్లల, జీవనశైలి, సామాజిక శాస్త్ర పుస్తకాలు ఉన్నాయి. విక్రయకేంద్రం తెరిచిన రోజే 300 పుస్తకాల్ని కొనేశారు. వారాంతానికి 800 పుస్తకాలు అమ్ముడుబోగా కొనుగోలుదారులు చెల్లించిన డబ్బు బుక్‌స్టోర్ నిర్వహణకు సరిపోతోందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఒక్కరు కూడా పుస్తక ధర చెల్లించకుండా వెళ్లలేదని, మెరుగైన సమాజానికి ఇలాంటివి మంచి ఉదాహరణలుగా నిలుస్తాయని అంటున్నారు.